RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 21 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | శుక్రవారం 24-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY తెలుగు దినపత్రిక R N I No. APTEL/2012/53127 The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజే లీసా గిల్

- శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



అమరావతి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ నియమితులయ్యారు. ఈ చరిత్రాత్మక నియామకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. జస్టిస్ లిసా గిల్‌కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకం ఒక చరిత్రాత్మక మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఉన్నత న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు. జస్టిస్ లిసా గిల్ తన సుదీర్ఘ న్యాయవాద వృత్తిలో విశిష్టమైన, ఆదర్శవంతమైన సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. సివిల్, క్రిమినల్, రాజ్యాంగ చట్టాలకు సంబంధించిన

2లో..

## కాళేశ్వరంపై సుప్రీంకోర్టులోనే

# తేల్చుకుందాం

- హైకోర్టు తీర్పును సవాల్ చేయనున్న తెలంగాణ ప్రభుత్వం
- కేసీఆర్, హరీశ్ లపై చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు - ఇప్పటికే పిటిషన్ సిద్ధం చేసినట్టు సమాచారం



హైదరాబాద్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. వెనక్కి తగ్గకూడదని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, దీనిని సుప్రీంకోర్టులో సవాలు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించి, అత్యున్నత న్యాయస్థానంలో అప్పీలుకు వెళ్లాలని మంత్రులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అయితే, ఈ కమిషన్ విచారణ విధానం, దాని పరిధిపై గత ప్రభుత్వంలోని కీలక నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సహజ న్యాయ సూత్రాలు పాటించలేదని, ప్రతివాదుల వాదనలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని వాదించగా, హైకోర్టు ఆ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవద్దని స్టే ఇచ్చింది.ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని, ప్రజా ధనం దుర్వినియోగం అయిందని బలంగా నమ్ముతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటే పీసీ ఘోష్ నివేదిక అత్యంత కీలకమని భావిస్తున్న తరుణంలో హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి ఎదురుదెబ్బగా మారింది. అందుకే, ఈ విషయంలో న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం, ప్రాజెక్టులో జరిగిన నష్టానికి బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలంటే సుప్రీంకోర్టులో స్టే ఎత్తివేయించుకోవడమే సరైన మార్గమని నిర్ణయానికి వచ్చింది. కేబినెట్ నిర్ణయం మేరకు, ప్రభుత్వం త్వరలోనే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. ప్రాజెక్టు వైఫల్యానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, విచారణ కమిషన్ సేకరించిన ప్రాథమిక ఆధారాలను కోర్టు ముందు ఉంచాలని

2లో..

## టార్గెట్లు కాదు..

# భద్రతే ముఖ్యం

- బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు



హైదరాబాద్ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్-ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి.

2లో..

## జగన్ కు వేదాశీర్వచనం..

# అర్చకులకు నోటీసులు

- ఒంటిమిట్ట ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం



అమరావతి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ అర్చకులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు షాక్ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంటికి వెళ్లిన ఒంటిమిట్ట ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించడం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలోనే ముగ్గురు అర్చకులకు టీటీడీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అధికారుల నుంచి ఎలాంటి ముందస్తు

2లో..

## భారత్ గొప్ప దేశం

- అంతలోనే మాటమార్చిన ట్రంప్!



న్యూఢిల్లీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను 'గొప్ప దేశం' అని అభివర్ణిస్తూ, తనకు అక్కడ ఒక 'చాలా మంచి స్నేహితుడు (మోదీ)' ఉన్నారని ప్రశంసించారు. అయితే, భారత్‌ను 'నరక కూపం' (హెల్ హోల్) అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలున్న పోడ్‌కాస్ట్‌ను రీపోస్ట్ చేసిన తర్వాత, ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇటీవల అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సేవేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాలను 'నరకకూపాలు'గా అభివర్ణించారు. అమెరికాలో

2లో..

# ఓటెత్తిన బెంగాల్, తమిళనాడు

- తమిళనాడులో 234 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు
- పశ్చిమ్ బెంగాల్‌లోని 294 సీట్లు రెండు దశల్లో ఎన్నిక
- మొదటి విడత 152 స్థానాలకు ముగిసిన పోలింగ్



న్యూఢిల్లీ తమిళనాడు, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు గురువారం పోలింగ్ జరిగింది. ఒకే విడతలో తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు, 294 స్థానాలున్న బెంగాల్‌లో రెండు దశల్లో ఎన్నికలు జరుగుతోన్న విషయం తెలిసిందే. బెంగాల్‌లో మొదటి విడత 152 సీట్లకు పోలింగ్ నిర్వహించారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ పోలింగ్ రికార్డుస్థాయిలో నమోదయ్యింది. తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకూ 82. 24 శాతం నమోదు కాగా బెంగాల్‌లో ఏకంగా 90 శాతం పోలింగ్ నమోదుకావడం గమనార్హం. కిందటిసారి తమిళనాడులో 76.6 శాతం, బెంగాల్‌లో 85.2 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే, 2021 ఎన్నికల్లో బెంగాల్‌లో 8 విడతల్లో పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు జనం పోటెత్తారు. బెంగాల్‌లో ఉదయం 9 గంటలకే 18 శాతం మంది ఓటేయడం గమనార్హం. బెంగాల్‌లో అక్కడక్కడా గొడవలు, ఘర్షణలు మినహా మొదటి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

2లో..

## మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో సగం కోత

- తెలంగాణ కేబినెట్ సంచలన నిర్ణయం



హైదరాబాద్ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ విషయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కేబినెట్ సమావేశంలో కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంపై కీలకంగా చర్చించామని, నేడు ఐదుగురు మంత్రులు కార్మిక సంఘాలతో చర్చిస్తారని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. నర్సంపేట, నల్గొండ ఘటనలపై కేబినెట్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.

2లో..

# తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో విషాదం

## - నర్సంపేట డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి



హైదరాబాద్ తెలంగాణలో జరుగుతున్న ఆర్టీసీ సమ్మెలో విషాదం చోటు చేసుకుంది. సమ్మెలో భాగంగా తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ వరంగల్ జిల్లాలోని నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద ఆత్మహత్యాయత్నం చేసిన డ్రైవర్ శంకర్ గౌడ్ మరణించాడు. ఎంజీఎం నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.నర్సంపేట ఆర్టీసీ డిపోవద్ద శంకర్ గౌడ్ ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నారు. ఇది గమనించిన తోటి ఆర్టీసీ కార్మికులు భయపడి కేకలు వేశారు. వెంటనే పరుగెత్తికెళ్లి శంకర్ గౌడ్‌ను అంటుకున్న మంటలను అదుపు చేశారు. అనంతరం 80 శాతం కాలిన గాయాలతో ఉన్న శంకర్ గౌడ్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

2లో..

## నేటి నుంచి జూన్ 11 వరకు

# వేసవి సెలవులు

- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు



హైదరాబాద్ విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్ 23 విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.

2లో..

## అమరావతి బిట్స్ క్యాంపస్‌లో క్వాంటం, ఏఐ

- 2027 నుంచి అడ్మిషన్లు



అమరావతి రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలానీ క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిట్స్ పిలానీ ప్రతినిధులు సమావేశమై క్యాంపస్ నిర్మాణ పురోగతిని వివరించారు. 2027 నుంచి అడ్మిషన్ల ప్రక్రియను

2లో..

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
The Voice of Telangana
శుక్రవారం, ఏప్రిల్ 24, 2026

## సింగరేణి కార్మికులకు క్వార్టర్ల కేటాయింపు



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియాకు చెందిన ఎన్సీడబ్ల్యూఏ ఉద్యోగుల క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్ కార్యక్రమం గురువారం రుద్రంపూర్‌లోని ఆర్సీఓఏ క్లబ్‌లో పారదర్శకంగా నిర్వహించబడింది. సీనియారిటీ ప్రాతిపదికన జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎంసీ, సి2 మరియు బి2 రకం క్వార్టర్లను కేటాయించారు. అధికారులు ముందుగా క్వార్టర్ల కేటాయింపు విధానం, అర్హతలు మరియు ప్రాధాన్యత క్రమాన్ని కార్మికులకు వివరించారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో కొత్తగూడెం ఏరియాకు చెందిన 151 మంది, సత్తుపల్లి ప్రాంతానికి చెందిన 13 మంది ఉద్యోగులు నమోదు చేసుకున్నారు. వీరిలో 65 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకోగా, 59 మంది గైర్హాజరయ్యారు. మరో 40 మంది ఉద్యోగులు క్వార్టర్ల పట్ల ఆసక్తి చూపలేదు. ముఖ్యంగా, 3 ఇంక్లైన్ జిఎం కార్యాలయం సమీపంలో ఎగ్జిక్యూటివ్‌ల కోసం కొత్తగా నిర్మించిన ఎంఏ, ఎంబీ క్వార్టర్లను వారికి కేటాయించగా, వారు ఖాళీ చేసిన ఎస్ సి టైప్ క్వార్టర్లను కార్మికులకు అందుబాటులోకి ఉంచడం గమనార్హం. ఈ సందర్భంగా ఏరియా జిఎం మాట్లాడుతూ.. ఎంతో పారదర్శకతతో ఈ ప్రక్రియను పూర్తి చేసిన కమిటీ సభ్యులను, యూనియన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం (పర్సనల్) జి.వి. మోహనరావు, ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ (సివిల్) కె. రాజారాం, ఏఐటీయూసీ ప్రతినిధి గట్టయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు ఎం.డి. రజాక్, ఎస్ఆర్ పిఓ మురళి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మొండివైఖరి వల్లే సమ్మె

**ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి**

**కార్మికుల పొట్టకొట్టే చర్యలను ప్రభుత్వం మానుకోవాలి**

**అసెంబ్లీలో కార్మికుల పక్షాన గళం వినిపించా..వినిపిస్తా**

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



కొత్తగూడెం (తెలంగాణ వాణి) ప్రభుత్వ మొండివైఖరి వల్లే ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు విమర్శించారు. 21వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు ఉద్యోగులు గురువారం కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం సరికాదని, వారి పొట్టకొట్టే చర్యలను మానుకోవాలని సూచించారు. ఎన్నికల హామీల అమలు కోసం కార్మికులు చేపట్టిన ఈ ఆందోళనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమ్మె వల్ల ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకముందే ప్రభుత్వం చర్చలు జరపాలని, లేనిపక్షంలో అసెంబ్లీలో కార్మికుల పక్షాన గళం వినిపిస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో కూడా పోరాటం చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఉన్నారు.

## జనగణన కార్యక్రమం సమర్ధవంతంగా నిర్వహించాలి.

**-జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి ఎం ప్రకాష్.**



ములుగు,ఏప్రిల్23(తెలంగాణ వాణి):జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారిఎం. ప్రకాష్ ఎన్యుమరేటర్స్/సూపర్ వైజర్లుకు తెలిపారు. గురువారం మొదటిరోజు మున్సిపాలిటీ ములుగు జనగణన,ఇండ్ల గణన శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ అండ్ బి గేస్ట్ హౌస్ ములుగులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య ప్రణాళికా అధికారి మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, మొత్తము 33 ప్రశ్నలతో కూడిన వివరాలు ఉంటాయని ప్రతి ప్రశ్నకు తగిన సమాదానాన్ని సరిగా నమోదు చేయాలన్నారు. తొలుత మే 11 నుంచి జూన్ 9వరకు సర్వే చేపడతామని ఆ తర్వాత రెండో విడత 2027 ఫిబ్రవరిలో జనాభా గణన సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గణన చేయాలని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారా చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

## రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం..

**ప్రారంభించిన తల్లాడ తహాశీల్దార్ కరుణాకర్ రెడ్డి**




తల్లాడ, ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి) మండలంలోని యూనియన్ బ్యాంక్ పక్కన రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని తల్లాడ తహాశీల్దార్ టీ. కరుణాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు తాగునీరు అందించడం అభినందనీయం అన్నారు. అనంతరం నిర్వాహకులు దారెల్లి తిమోతి మాట్లాడుతూ రెడీమ్ ఇండియా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ మనోహర్ జేమ్స్ ఆర్థికసాయంతో రెండు జీవ జలముల కేంద్రాలు ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనాపురం ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు , టిసిసి తల్లాడ మండల అధ్యక్షులు కే. ఇజ్రాయేలు, సూర్యం, నారపోగు ప్రసాద్, రేగళ్ల శ్రీనివాసరావు కాంపాటి రవి, దారెల్లి ఇందిరా, రావుల గోపయ్య గౌడ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జస్వంత్ పంచెకట్టు, నికిత ఓణీల వేడుకలు

**చిన్నారులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు తుమ్మలపల్లి రమేష్.**



తల్లాడ (తెలంగాణ వాణి) మండల పరిధిలో అన్నారుగూడెం గ్రామానికి చెందిన మంచికంటి రామారావు స్పందన దంపతుల కుమారుడు చిరంజీవి జస్వంత్ కు పంచెకట్టు వేడుక నికిత కు పుష్పాలంకరణ వేడుక గురువారం అన్నారుగూడెం గ్రామంలో స్థానిక శ్రీ మహాలక్ష్మి కళ్యాణమండపం నందు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ నాయకులు మారెళ్ళ మల్లికార్జునరావు. తుమ్మలపల్లి రమేష్ . మరికొంతమంది స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిన్నారులను అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ఉన్నత విద్యనభ్యసించి ఉన్నతమైన స్థితిలో నిలవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ మల్లికార్జున రావు, తుమ్మలపల్లి రమేష్, తదితరులు చిన్నారులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

## మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో సగం కోత

రాష్ట్రంలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తీర్చేందుకు ప్రభుత్వం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. మంత్రులు,ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం నిలిపివేసి , ఆ నిధులను రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల కోసం మళ్లించాలని కేబినెట్ తీర్మానించింది. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, కేవలం 100 రోజుల్లోపు ఈ సమస్యను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, సాధారణ ఉద్యోగులకు 6,200 కోట్లు రిటైర్డ్ ఉద్యోగులకు 8,000 కోట్లు ర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మంత్రులు స్వచ్ఛందంగా తమ జీతాల్లో 50 శాతం వదులుకోవడానికి ముందుకొచ్చారు. ఇతర ప్రజాప్రతినిధుల జీతాలను కూడా దీనికి మళ్లించడంతో పాటు, ప్రత్యామ్నాయ నిధుల సమీకరణ మార్గాలను వెంటనే అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. దాంతోపాటు కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఒత్తిడి చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందన్నారు. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో సబ్ కమిటీ వేశామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీ వాసవీ మాత జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటించింది. ఇకనుంచి ఏటా వైశాఖ శుక్ల పక్ష దశమి నాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ లాంఛనాలతో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 26 న వాసవీ జయంతి రానున్న నేపథ్యంలో ఆ రోజున ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో వాసవీ మాత జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని పేర్కొంది.

## నేటి నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు

జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

## అమరావతి బిట్స్ క్యాంపస్‌లో క్వాంటం, ఏఐ

ప్రారంభించనున్నట్లు వారు ముఖ్యమంత్రికి తెలిపారు. రాజధానిలో నిర్మిస్తున్న ఈ క్యాంపస్‌ను ఒక 'ఐకానిక్, ఏఐ క్యాంపస్'గా తీర్చిదిద్దుతున్నామని ప్రతినిధులు వెల్లడించారు. ఇందులో క్వాంటం టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బిట్స్ పిలానీ అమరావతి క్యాంపస్‌ను మూడు దశల్లో నిర్మిస్తున్నామని, మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునేలా దీనిని అభివృద్ధి చేస్తున్నామని ప్రతినిధులు వివరించారు. ఈ క్యాంపస్‌తో పాటు సంస్థ విస్తరణకు మొత్తం రూ.250 కోట్ల మేర వ్యయం చేయనున్నట్లు వారు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో క్యాంపస్ నిర్మాణం, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు.

## ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజే లీసా గిల్

అనేక కేసులను ఆమె నైపుణ్యంగా వాదించారని గుర్తు చేశారు. న్యాయం పట్ల ఆమెకున్న నిబద్ధత ఎంతో గౌరవాన్ని సంపాదించిపెట్టిందని తెలిపారు. జస్టిస్ లిసా గిల్ తన పదవీకాలంలో విజయవంతం కావాలని, స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. వివేకం, చిత్తశుద్ధితో న్యాయాన్ని అందిస్తూ, చట్టబద్ధమైన పాలనను నిలబెడతారని తాను విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై సుప్రీంకోర్టులోనే తేల్చుకుందాం

ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల హామీ ఇచ్చిన ప్రభుత్వం, న్యాయపోరాటం ద్వారా తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని చూస్తోంది. బీఆర్ఎస్ మాత్రం ఈ కమిషన్ ఏర్పాటు రాజకీయ కక్ష సాధింపులో భాగమేనని ఆరోపిస్తున్నాయి. హైకోర్టు తీర్పు తమ వాదనకు బలాన్ని ఇచ్చిందని వారు పేర్కొంటుండగా, సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కాళేశ్వరం భవిష్యత్తును, బాధ్యులపై తీసుకోబోయే చర్యలను శాసించనుంది. మొత్తానికి, కాళేశ్వరం విచారణ వ్యవహారం ఇప్పుడు ఢిల్లీ వేదికగా సాగనున్న న్యాయపోరాటంగా రూపుదాల్చింది.

## టార్గెట్లు కాదు..భద్రతే ముఖ్యం

'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు. కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

## జగన్ కు వేదాశీర్వచనం.. అర్చకులకు నోటీసులు

అనుమతు తీసుకోకుండా నిబంధనలను అతిక్రమించి రాజకీయ నేతలను కలిసినందుకు గానూ ఈ నోటీసులు జారీ అయ్యాయి. ఒంటిమిట్ట ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్న ఎ. శ్రావణ్‌కుమార్, కె. పార్థసారథి, వీణా మనోజ్‌కుమార్ ఇటీవల పులివెందులకు వెళ్లారు. ఆ సమయంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. ఈ క్రమంలోనే వైఎస్ జగన్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం అత్యంత పవిత్రంగా భావించే శేష వస్త్రంతోపాటు రాములోరి తోమాల, ముత్యాల తలంబ్రాలను కూడా అర్చకులు వైఎస్ జగన్‌కు అందించారు. నిబంధనల ప్రకారం టీటీడీ, దాని పరిధిలో ఉన్న ఆలయాల్లో పనిచేసే అర్చకులు, సిబ్బంది ఇలాంటి కార్యక్రమాలకు వెళ్తే తప్పనిసరిగా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఈ ముగ్గురు అర్చకులు మాత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే పులివెందులకు వెళ్లడం, అక్కడ వేదాశీర్వచనం ఇవ్వడంపై టీటీడీ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ ముగ్గురు అర్చకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఒంటిమిట్ట ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి ఎ. ప్రశాంతి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ప్రొటోకాల్ పాటించకుండా అనుమతి లేకుండా బయటి వ్యక్తులకు ఆలయ మర్యాదలు ఎలా చేస్తారని ఆగ్రహించారు. ఈ నోటీసులకు సంబంధించి 2 రోజుల్లోగా సరైన వివరణ ఇవ్వాలని లేకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అర్చకులు ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తేల్చి చెప్పారు. నిబంధనలు పాటించడం, ఆలయ పవిత్రతను కాపాడటంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని టీటీడీ అధికారులు హెచ్చరించారు.

## భారత్ గొప్ప దేశం

జన్మస్థలం ఆధారంగా పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఆయా దేశాల మహిళలు తొమ్మిదో నెల గర్భంతో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా సులువుగా పౌరసత్వం పొందుతున్నారని ఆయన ఆరోపించారు. భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను, ట్రాన్‌స్క్రిప్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో రీపోస్ట్ చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై తన వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. 'భారత్ ఒక గొప్ప దేశం. ఆ దేశ నాయకత్వంలో నాకు ఒక మంచి స్నేహితుడు ఉన్నారు' అని ట్రంప్ అన్నట్లు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపారు. ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ స్పందిస్తూ, "మేము కొన్ని నివేదికలు చూశాం, అంతకు మించి మాట్లాడడానికేమీలే దు" అని క్లుప్తంగా బదులిచ్చారు. అమెరికాలో వలస విధానాలు, బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌పై తీవ్రంగా చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. మొత్తంమీద, ఈ వివాదం ద్వారా చెలరేగిన దుమారాన్ని చల్లార్చేందుకే ట్రంప్ భారత్‌తో తన స్నేహాన్ని మరోసారి గుర్తుచేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఓటెత్తిన బెంగాల్, తమిళనాడు

రెండో దశలో 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. కేరళ, అసోం, పుదుచ్చేరిలతో పాటు ఈ రెండు రాష్ట్రాల్లో మే 4న ఓట్లను లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు. ఇదిలా ఉండగా, గురువారం ఉదయం బెంగాల్‌లో పోలింగ్ ప్రారంభమైన తర్వాత ముర్షిదాబాద్ జిల్లాలోని నౌదాలో జరిగిన పేలుడులో పలువురు గాయపడ్డారు.

అక్కడ టీఎంసీ, ఏయూజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు, హింస జరిగినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఏయూజేపీ అధ్యక్షుడు హుమయూన్ కబీర్ కూడా టీఎంసీ కార్యకర్తలతో వాగ్వాదానికి దిగారు. ఇది ఉద్రిక్తతలకు దారితీయడంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా సిబ్బందిని మోహరించారు. గుంపును చెదరగొట్టడానికి పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేయాల్సి వచ్చింది. వరుసగా నాలుగోసారి గెలిచి, హ్యాట్రిక్ సాధించాలని సీఎం మమతా బెనర్జీ నాయకత్వంలోని టీఎంసీ తొలిసారి బెంగాల్‌లో కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇక, బెంగాల్‌లో ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశం ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. ఎస్ఐఆర్ ప్రక్రియతో మొత్తం 90 లక్షల ఓట్లను తొలగించారు. ఎస్ఐఆర్ విషయంలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఈసీతో యుద్ధం చేస్తున్నారు. ఇక, బీజేపీ సైతం గెలుపుపై భారీగా ఆశలు పెట్టుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా బీజేపీ అగ్రనేతలు బెంగాల్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ 77 సీట్లతో ప్రతిపక్ష హోదా దక్కించుకున్న సంగతి తెలిసిందే.

## తెలంగాణ ఆర్టీసీ సమ్మెలో విషాదం

అక్కడ నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

**- డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి**

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. తమ న్యాయమైన 32 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఒకవైపు సమ్మె చేస్తూనే మరోవైపు ఆర్టీసీ బస్ డిపోల వద్ద, బస్టాండ్‌ల వద్ద నిరసనలు చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు.

ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం వరంగల్ జిల్లా నర్సంపేట బస్ డిపో వద్ద ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో 80 శాతం కాలిన గాయాలవ్వడంతో ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. తోటి ఉద్యోగులు అతడిని వరంగల్ ఎంజీఎంఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. అయితే మార్గమధ్యలో కర్మాన్ ఘాట్ వద్ద డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణాలొదిలాడు. ప్రస్తుతం శంకర్ గౌడ్ మృతదేహం కంచన్ బాగ్ డీఆర్డీఓ అపోలో ఆస్పత్రిలో ఉంచినట్లు తెలుస్తోంది.

RNI No. APTEL/2012/53127

## హిందూ సమ్మేళనానికి జిల్లా ఎస్.పి రోహిత్ రాజ్ కి ఆహ్వానం



కొత్తగూడెం (తెలంగాణ వాణి) ఈ నెల 26న కొత్తగూడెంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి సమ్మేళనం కమిటీ సభ్యులు బుధవారం జిల్లా ఎస్.పి శ్రీ రోహిత్ రాజ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమ్మేళనం యొక్క ఉద్దేశాలు, కార్యక్రమ వివరాలు, నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్.పి కి వివరించారు. కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగానిర్వహించబడుతుందని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్.పి రోహిత్ రాజ్ కార్యక్రమ వివరాలు తెలుసుకుని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, హిందూ సమ్మేళనం కార్యక్రమం సమాజ ఐక్యత, ధర్మ పరిరక్షణ, సాంస్కృతిక విలువల బలోపేతం లక్ష్యంగా నిర్వహించబడుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, సభ్యులు గుర్రం వెంకట్ రెడ్డి, పిల్లి రాజేశ్వరరావు, యెలదండి పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కవితక్క పార్టీ ఆవిష్కరణ సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలి

### ఎల్లారెడ్డి జాగృతి మండల అధ్యక్షుడు అన్నిజీ గాంధీ



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి) ఎల్లారెడ్డి మండల్ 31 గ్రామపంచాయతీల ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని రేపటి కవితక్క నూతన పార్టీ ఆవిష్కరణ విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి జాగృతి మండల అధ్యక్షుడు అన్నిజీ గాంధీ పిలుపునిచ్చారు. రేపు హైదరాబాద్ లో జరిగే తెలంగాణ జన జాగృతి పార్టీ ఆవిర్భావ సభ జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రజల హక్కుల కోసం పోరాటం చేయడానికి కవితక్క ఆధ్వర్యంలో ఈ పార్టీ ప్రారంభమవుతుంది అని ఇది సబ్బండ వర్గాల పార్టీ అని, ఇది తెలంగాణ ప్రజల కోసం ఏర్పడుతున్న పార్టీ కావున ఈనెల 25న పార్టీ ఆవిర్భావ సభకు మండలం నుండి జిల్లా నుండి వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి కవితక్క కు మన మద్దతు తెలుపుదామన్నారు.

## సోషల్ మీడియా పోస్టులపై పోలీసుల హెచ్చరిక



మహదేవపూర్ (తెలంగాణ వాణి) వాట్సాప్ ఫేస్బుక్ ఇంస్టాగ్రామ్ లలో కులం, మతం, వర్గాలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు, పోస్టులు లేదా సందేశాలు పంపడం చట్టరీత్యా నేరమని మహాదేవపూర్ పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో బాధ్యతారాహిత్యంగా తప్పుడు ప్రచారం చేయడం, అసత్య సమాచారం పంచుకోవడం లేదా ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో అశాంతి, విద్వేషాలకు దారి తీస్తుందని పోలీసులు తెలిపారు. ఇలాంటి పోస్టులు లేదా సందేశాలు షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం కూడా చట్టపరమైన చర్యలకు గురి కావాల్సిన పరిస్థితి తీసుకువస్తుందని పేర్కొన్నారు. కాబట్టి సోషల్ మీడియాను ఉపయోగించే ప్రతి ఒక్కరు బాధ్యతతో వ్యవహరించాలని, నిర్ధారణ లేని సమాచారం లేదా వివాదాస్పద వ్యాఖ్యలను పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా కులం, మతం, వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా పోస్టులు లేదా సందేశాలు పంపినట్లు గుర్తించినట్లయితే, వారి పై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మహాదేవపూర్ పోలీసులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని, అందరూ చట్టాలను గౌరవించి సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని మహాదేవపూర్ సీఐ ఎన్. వెంకటేశ్వర్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మహార్షి భగిరథుని జయంతి వేడుక



ఆదిలాబాద్ ( తెలంగాణ వాణి ప్రతినిధి ) మహార్షి భగిరథుడు కఠినమైన దీక్షను చేసి గంగాను భూమిపైకి తీసుకువచ్చారని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహార్షి భగిరథుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో భగిరథుని చిత్రపటానికి అదనపు కలెక్టర్ చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి పూలామలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ. భగిరథుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన పవిత్ర పురాన రాజు అని తన పూర్వీకులైన సాగరపుత్రుల ఆత్మలకు మోక్షం ప్రసాదించడానికి ఆకాశం నుండి గంగను భూమికి తీసుకువచ్చేలా కఠోర తపస్సు చేశారని గుర్తు చేశారు. అప్పుడే తమ పూర్తికుల ఆత్మ శాంతించిందని భగిరథుడు నమ్మడని తెలిపారు. మన లక్ష్యాన్ని చేరేందుకు ఎన్నో కష్టాలు ఎదురవుతాయని వాటిని అదిగమించి లక్ష్యంవైపు పయనమవ్వాలన్నారు. దానికి భగిరథుడి కఠోర తపస్సును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వర్ణ, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



మందమర్రి టౌన్ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి విలేకరి) మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధా కృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఏరియా పర్సనల్ విభాగంతో పాటు గనుల సంక్షేమ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం రాధకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను త్వరిత గతిన పరిష్కరిం చాలని,ఉద్యోగుల వ్యక్తిగత, పని సంబంధిత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పర్సనల్ విభాగం ఫైళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు అందే వైద్య సదుపాయాలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు, టెర్మినల్ బెనిఫిట్స్ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో డిజిఎం పర్సనల్ అశోక్, ఐఈ డి కిరణ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏరియా గనుల సంక్షేమ అధికారులు పర్సనల్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 23 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) వెనుకబడిన తరగతుల బాలికలకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' సంక్షేమ వారోత్సవాలలో భాగంగా, తాంసి మండలం బండల్ నాగాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ నివాస పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు)లో పేరెంట్స్ టీచర్స్ సమావేశ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలకు నాణ్యమైన విద్యను అందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, వారికీ అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు ఉచిత వసతి, పౌష్టికాహారం అందించడంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం తరగతుల వారిగా పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు, పాఠశాలకు అత్యధిక హాజరు శాతం ఉన్న విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను కలెక్టర్ శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసుమతి, తహసీల్దార్ లక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా మహర్షి భగీరథ జయంతి వేడుకలు



నిర్మల్, ఏప్రిల్:23(తెలంగాణ వాణి ప్రతినిధి) కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గురువారం, భగీరథ మహర్షి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా పలువురు అధికారులు, నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు మాట్లాడుతూ, మహర్షి భగీరథ మహర్షి గొప్పతనం, విశేషాలను వివరించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎల్డిఎం రామ్ గోపాల్, పలువురు సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసిన సిద్ది శ్రీధర్ గుప్తా

ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఆర్యవైశ్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి అభినందించడంతో పాటుగా ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని రాష్ట అధికారిక పండుగగా గుర్తించడం పట్ల ఎల్లారెడ్డి ఆర్యవైశ్య సంఘ నాయకులు సిద్ధి శ్రీధర్ గుప్తా హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటంలో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



## చౌడు తండాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పట్ల హర్షం వ్యక్తం.



హుస్నాబాద్ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ఆర్ సి) మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని అక్కన్నపేట మండలం, కెప్టెన్ చౌడు తండాలో గల గుగులోతు రమేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూప రాజు నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు పేదలకు వరంగా మారిందని, పేదల కళ్ళలో ఆనందం చూస్తున్నామని,, మా గ్రామ పంచాయతీలో పరిధిలో పేద ప్రజలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, అక్కన్నపేట సర్పంచ్ సంపత్, హౌసింగ్ ఏఈ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్య శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొని సుజాత రమేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దాహార్తితో రోడ్డెక్కిన మహిళలు

### గ్రేటర్ 66వ డివిజన్‌లో ఖాళీ బిందెలతో నిరసన

### కార్పొరేటర్ తీరుపై కాలనీ వాసుల ఆగ్రహం

### పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు



హసన్ పర్తి:ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి) గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ పరిధిలోని పోతారాజు కాలనీలో త్రాగునీటి సమస్య జటిలమైంది. గత నెల రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న మహిళలు, గురువారం నాడు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. నగరానికి అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ, కనీస అవసరమైన మంచినీటిని కూడా అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని కాలనీవాసులు మండిపడుతున్నారు. నీటి సమస్యపై గత కొన్ని నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ స్పందించడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ సైతం సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా, అధికారుల పైకి నెపం నెడుతూ కాలయాపన చేస్తున్నారని వారు విమర్శించారు. ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఇప్పుడు సమస్య వస్తే సానుభూతి మాటలు చెబుతున్నారని కార్పొరేటర్ తీరును ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులు, గెలిచిన తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని ఆరోపించారు. డివిజన్‌లో కేవలం త్రాగునీటి సమస్యే కాకుండా, డ్రైనేజీల నిర్వహణ కూడా అధ్వానంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. మున్సిపల్, మిషన్ భగీరథ, ఎలక్ట్రిసిటీ విభాగాలకు చెందిన ఏ ఒక్క సిబ్బంది కూడా తమ గోడు వినడం లేదని, దీనికి కార్పొరేటర్ అసమర్థతే కారణమని కాలనీ ప్రజలు నేరుగా నిలదీశారు. కార్పొరేటర్ తీరుపై విసుగు చెందిన స్థానికులు, రాబోయే రోజుల్లో ఏ రాజకీయ నాయకుడిని నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని కాలనీ వాసులు హెచ్చరించారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### వేములవాడ డిపో కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు

### ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలని కడారి రాములు డిమాండ్



వేములవాడ (తెలంగాణ వాణి ప్రతినిధి) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆర్టీసీ బస్ డిపో వద్ద చేపట్టిన సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి ఆయన నిరసనలో పాల్గొన్నారు. ?ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ ఆర్టీసీని తక్షణమే ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్,సీసీఎస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కొమ్ముకాయకుండా, ప్రభుత్వమే నేరుగా బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలని కోరారు. ఆ బస్సులను సైతం ఆర్టీసీ కార్మికులతోనే నడిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.?ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు,ఆర్టీసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లర్ల వైనం



రాజపేట ఏప్రిల్: 23(తెలంగాణ వాణి విలేకరి) రాజపేట విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు రాజాపేట మండలం లో వరి ధాన్యానికి ఏ ఈ ఓ లు ఏ గ్రేడ్ అని సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత కాంట వేసుకొనిధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లు కు తరలించిన ధాన్యాన్ని దిగుమతి చేసిన తర్వాత ఈ ధాన్యాన్ని మేము బి గ్రేడ్ కిందనే డబ్బులు ఇస్తామని రైస్ మిల్లర్లు ప్రతి సెంటరు తిరుగుతూ మీరు బి గ్రేడ్ గానే సర్టిఫైడ్ చేయాలని సెంటర్ ఇన్చార్జిలను ఇబ్బంది పెడుతున్న వైనం ఆరుగాలం రైతులు కష్టం చేసిన అన్నదాత తను ఇబ్బంది పెడితే రైతులతో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా కేసీఆర్ పరి పాలనలో రైతులకు స్వర్ణయు గంలా ఉండేది అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులను ఇబ్బందులు పెడితే సహించే ప్రసక్తే లేదని విలేకరులతో ఆయ అన్నారు. వెంటనే వ్యవసాయ అధికారులు స్థానిక అధికారులందరూ ఈ రైస్ మిల్ దళారులపై చర్యలు తీసుకోగలరని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుఱ్ఱం నర్సింలు అధికారులను రైస్ మిల్ దళారులను హెచ్చరించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



జగిత్యాల: ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ వ్యవసాయ మార్కెట్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ బి ఎస్ లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, అధ్యక్షులు గాజంగి నందయ్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ సరిత



మహాదేవపూర్ (తెలంగాణ వాణి) మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ సరిత హాజరై విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయులు--తల్లిదండ్రుల సమావేశంలో వేసవి సెలవుల సమయంలో పిల్లలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు.ఇటీవల గురుకుల పరీక్షలు రాసిన విద్యార్థులకు సీట్లు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయిలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదయ్య, కరిష్మా, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ లింగమంతుల స్వామి ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

### పాల్గొన్న ప్రభుత్వ విప్



నకిరేకల్ ( తెలంగాణ వాణి) నకిరేకల్ మండలం నెలిబండ గ్రామంలో శ్రీ లింగమంతుల స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నకిరేకల్ శాసనసభ సభ్యుడు , ప్రభుత్వ విప్ శ్రీ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గా నియమితులైన యానాల యాదగిరి రెడ్డి మరియు ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు సమిష్టిగా కృషి చేయాలని నూతన కమిటీకి వీరేశం సూచించారు. ఈ కార్యక్రమానికి డిసిసి అధ్యక్షులు ఉన్న కైలాష్ నేత , నకిరేకల్ మున్సిపాల్ చైర్మన్ రజిత – శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ రాఘవులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు నూతల పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు .

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు, సంపూర్ణ మద్దతిస్తున్నం : సాదం రమేష్

### రాష్ట్ర ప్రభుత్వం సమస్యను తక్షణమే,పరిష్కరించాలి



జనగామ:ఎప్రిల్ 23(తెలంగాణ వాణి ప్రతినిధి) ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె వల్ల,రాష్ట్ర వ్యాపితంగా,జన జీవనం స్థంభించిందని,అందుకు గత,ప్రస్తుత ప్రభుత్వాల దిక్కుమాలిన పరిపాలన మాత్రమే కారణమని,యుద్ధ ప్రాతిపదికన సమస్యను పరిష్కరించాలని సీపీఎం చిల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి సాధం రమేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాలకులు అనుసరిస్తున్న దివాలాకోరు ఆర్థిక విధానాల వల్లనే,ఆర్టీసీ దివాలా తీసిందని,ఆయన దుయ్యబట్టారు.సంస్థ రక్షణ కోసం వివిధ కార్మిక సంఘాల జేఏసీ అధ్వర్యంలో,రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ పార్టీ సీపీఎం చిల్పూర్ మండల శాఖ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని,సమ్మెకు పూనుకున్న కార్మికుల న్యాయమైన డిమాండ్లను బేషరతుగా ,ఆమోదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవాలని, ఉద్యోగాల భర్తీ,బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ తదితర 32 డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ 4 వారాల గడువు కోరడం సమ్మెను నీరుగార్చడమే తప్ప మరొకటి కాదు.ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాల జేఏసీతో చర్చలు జరిపి, ఆర్టీసీ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పరిష్కరించాలని ఆయన ఆ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల హామీ మేరకు, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి,కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా రావలసిన సుమారు,400 కోట్లతో పాటు,ఇతర బకాయిలను వెంటనే చెల్లించి,సంస్థను ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలని ఆయన అన్నారు.అద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు,ఎలక్ట్రిసిటీ బస్సులను ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి నడుపుతున్నది.ఆ విధానానికి స్వస్తి పలికి ప్రభుత్వమే నేరుగా,ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి,వాటిని సంపూర్ణంగా ఆర్టీసీ సంస్థకే అప్పగించాలని ఆయన కోరారు.ఏళ్ల తరబడి కనీస వేతనాలు,సౌకర్యాలు లేకుండా శ్రమ దోపిడీకి గురవుతున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి.ఖాళీగా ఉన్న డ్రైవర్,కండక్టర్ నియామకాలను వెంటనే చేపట్టి కార్మికులపై ఉన్న అదనపు పనిభారాన్ని తగ్గించాలని ఆయన పేర్కొన్నారు.గుర్తింపు సంఘం ఎన్నికలను జరపకపోవడం అంటే ప్రభుత్వం వారి హక్కులను కాలరాస్తూ,కార్మికుల గొంతు నొక్కడమే ఔతుంది.ఇది కార్మిక వర్గం సాధించుకున్న ప్రాథమిక హక్కులపై దాడిగా తమ పార్టీ భావిస్తున్నదని. తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆయన అన్నారు.ప్రభుత్వ నిర్వాకం వల్ల 39 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సమ్మె కారణంగా నేడు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితుల పట్ల తమ పార్టీ తీవ్ర నిరసన తెలియజేస్తున్నదని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళల భద్రత సామాజిక బాధ్యత

### పరిశోధనాంశాలను వివరించిన సైకాలజీ అధ్యాపకురాలు డాక్టర్ అఫ్రిన్ వసీం



పటాన్ చెరు, ఏప్రిల్,23, (తెలంగాణ వాణి రిపోర్టర్) మహిళలు భయం లేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావరణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రీన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 'పరిశోధన చర్చల' శ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్ ను గురువారం నిర్వహించింది. 'భయంలో జీవించడం: భారతదేశంలోని మహిళలపై లైంగిక హింస ముప్పు యొక్క మానసిక ప్రభావం' అనే శీర్షికతో జరిగిన ఈ ఉపన్యాసం, లైంగిక హింస యొక్క నిరంతర ముప్పు కారణంగా మహిళలు మోస్తున్న, విస్తృతంగా వ్యాపించి ఉన్న, తరచుగా విస్మరించబడే మానసిక భారాన్ని పరిశీలించింది. ఈ భయం వారి మానసిక ఆరోగ్యాన్ని, ప్రవర్తనను, రోజువారీ నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తుందో డాక్టర్ వసీం వివరించారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 'అనాలిసిస్ ఆఫ్ సోషల్ ఇష్యూస్ అండ్ పబ్లిక్ పాలసీ' (వైలీ) జర్నల్ లో ప్రచురితమైన ఆమె పరిశోధన, అందులోని ప్రధాన అంశాలను డాక్టర్ వసీం వివరించారు. అనుభవపూర్వక పరిశోధనల ఆధారంగా, సమాజంలో లోతుగా పాతుకుపోయిన, ఈ సవాళ్లను పరిష్కరించడానికి మరింత అవగాహన, విధానపరమైన జోక్యం, బలమైన సహాయక వ్యవస్థల ఆవశ్యకతను ఆమె నొక్కి చెప్పారు. 'భయం యొక్క పటం'గా వర్ణించిన ఆరు కీలక అంశాలను డాక్టర్ వసీం సమర్పించారు. బహిరంగ ప్రదేశాలలో నిరంతర అతి జాగరూకత, మారిన జీవన విధానాలు–పరిమితమైన చలనశీలత, మహిళలు అవలంబించే సర్దుబాటు పద్ధతులు, ఆందోళన–భావోద్వేగ అలసట వంటి మానసిక ప్రభావాలు, రక్షణ పేరుతో కుటుంబం విధించే ఆంక్షలు, వ్యవస్థాగత మార్పు కోసం పెరుగుతున్న డిమాండ్లతో పాటు శారీరక హింస లేకపోయినా, భయమే నిజమైన హానిని కలిగించగలదని ఆమె అభిప్రాయపడ్డారు. అర్థవంతమైన సంస్కరణల కోసం పిలుపునిస్తూ, సకాలంలో న్యాయం, బలమైన చట్ట అమలు, సహాయక కుటుంబ వాతావరణం, బాధితులను నిందించే వైఖరులను సవాలు చేసే సాంస్కృతిక మార్పు యొక్క ఆవశ్యకతను డాక్టర్ వసీం నొక్కి చెప్పారు. న్యాయమైన సమాజానికి మహిళల భద్రతను నిర్ధారించడం ప్రాథమికమని స్పష్టీకరిస్తూ, ఆమె తన ఉపన్యాసాన్ని ముగించారు. జీఎస్ హెచ్ఎస్ సంస్థాగత పరిశోధన కమిటీ నిర్వహించిన ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సమకాలీన భారతదేశంలో లింగం, భద్రత, మానసిక శ్రేయస్సుపై విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తూ, ఆసక్తికరమైన చర్చతో ఈ సమావేశం ముగిసింది.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

- గ్రేటర్ పై గులాబీ జెండా ఎగరాలి
- మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్





తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, ( ఏప్రిల్ 23) : గులాబీ శ్రేణులు నా కుటుంబ సభ్యులు,వారికి ఎల్లవేళలా అండగా ఉంటా, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.వడ్డేపల్లి స్నేహ నగర్ ఎస్వీ కన్వెన్షన్ హాల్ నందు బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం రోజున నిర్వహించారు.ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడు ప్రజా జీవితంలో ఉన్నా, ప్రజల కోసమే ఉన్నా,20 ఏండ్ల ప్రజా జీవితంలో ప్రజలకు సేవ చేశానని,రెండున్నర ఏండ్లుగా బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడుతున్నామన్నా రు.ప్రజల తరపున పోరాడుతున్న నాపై, మా శ్రేణులపై అక్రమ కేసులు పెడుతున్నారని,కేసులు మాకు కొత్తకాదు,సమిష్టిగా పార్టీ ని బలోపేతం చేద్దాం,డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుదాం.ప్రజల గొంతుకగా కొట్లాడుదాం గళం వినిపిద్దాం.రాబోవు ఎన్నికల్లో సత్తా చాటుదాం. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం, బీఆర్ఎస్ సర్కారు.పార్టీ కష్ట కాలంలో అండగా ఉన్నవాళ్లకు భవిష్యత్ లో పార్టీ అండగా ఉంటుందన్నారు.బూత్, డివిజన్, నియోజకవర్గ కమిటీలను అతి త్వరలో ఏర్పాటు చేసుకుందాం.కాగా 63 డివిజన్ కి చెందిన 50 మంది యువకులు బీఆర్ఎస్ నాయకులు మహమూద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు.కాగా పార్టీ బలోపేతానికి 26 డివిజన్లకు ఇంచార్జ్ లను నియమించారు.

# కేసీఆర్ ఖ్యాతి విశ్వ వ్యాప్తం

### బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్



తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, ( ఏప్రిల్ 23) : కేసీఆర్ కీర్తిని తగ్గించలేరని,ప్రపంచంలోనే గొప్ప సాగు తాగు నీరు ప్రాజెక్ట్ కాళేశ్వరం ప్రాజెక్ట్ అని,కాంగ్రెస్ కుట్రపూరితంగా కేసీఆర్ ను బద్నామ్ చేసే ప్రయత్నం చేస్తోందని,కాళేశ్వరం ప్రాజెక్టు పై కమిషన్ వేసి కేసీఆర్ ను తప్పుగా చూపాలని ప్రయత్నం చేశారు,కానీ హై కోర్ట్ నిన్న ఇచ్చిన తీర్పు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు.నీళ్లు నిధులు నియామకాల కోసం పోరాడి,కొట్లాడి సాధించిన తెలంగాణ ను 9 ఏండ్లలో బంగారు తెలంగాణ గా తీర్చారని, తమ కార్యకర్తలను, నాయకులను కేసుల పాలు చేస్తున్నారన్నారు.కేసులకు అదరం బెదరం,ప్రజల తరపున పోరాడుతాం,చిల్లర గాళ్ళ చిల్లర మాటలకు సమాధానం ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే,మా నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ల పై కక్షపూరితంగా కమిషన్ లు,విచారణల పేరుతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు.కేసులు కొట్లాటలు మాకు కొత్త కావు,తమకు న్యాయస్థానాల మీద నమ్మకం ఉందని,ప్రజల తరపున బాధ్యత గల ప్రతిపక్షం గా బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు.ప్రెస్ మీట్ లో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, సంకు నర్సింగ రావు, ఇమ్మడి లోహిత రాజు, బొంగు అశోక్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు సుధాకర్ రెడ్డి, పులి రజినీకాంత్, రామ్మూర్తి, చిన్న, దూలం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వాణి



# ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్, ఏప్రిల్ : 23 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. తాంసి మండలం పొన్నారి గ్రామ శివారులో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మస్టర్ రోల్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఆస్తుల కల్పన జరగాలని, పనుల నిర్వహణలో ఎక్కడా రాజీ పడకూడదని ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కూలీలు చేసిన పనికి తగిన వేతనం అందేలా కొలతలు ఖచ్చితంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున కూలీలు అస్వస్థతకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి పని ప్రదేశంలోనూ నీడ సౌకర్యం, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పనుల పరిశీలనలో భాగంగా కూలీలతో ముఖాముఖి మాట్లాడుతూ, పని ప్రదేశంలో మీకు కావాల్సిన సౌకర్యాలు అందుతున్నాయా? సకాలంలో వేతనాలు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, మండల అభివృద్ధి అధికారి మోహన్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీ, సర్పంచ్ భీమన్న, ఏపీఓ విజయ, టెక్నికల్ అసిస్టెంట్ పుష్ప, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ టీం.



జూలూరుపాడు: ఏప్రిల్ 23 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) నరసింహసాగర్ గ్రామంలో పొలిటికల్ పవర్ ప్రతినిధి మందా లక్ష్మణ్ బావమరిది శ్రావణ్ కుమార్ వివాహ వేడుకలో జూలూరుపాడు మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వీరు నాయక్, కార్యదర్శి భానోత్ రమేష్, కంచెపోగు నర్సింహారావు తో పాటు ఇతర సభ్యులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, దాంపత్య జీవితం ఆనందమయంగా సాగాలని ఆకాంక్షించారు..

# మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేస్తాం

**- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ .**



కుత్బుల్లాపూర్... ఏప్రిల్ 23... తెలంగాణ వాణి... 126- జగద్గిరిగుట్ట డివిజన్ వాంబే హౌస్ కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ , అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు నూతన వీధి దీపాలు ఏర్పాటుచేసి అంతర్గత సిసి రోడ్లను నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...వాంబే హౌస్ కాలనీలో ఇప్పటికే అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని ప్రస్తుత పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రానున్న రోజుల్లో బాంబే హౌస్ కాలనీలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే హౌస్ కాలనీ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి, మౌనిక, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్రా అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, విటల్, దాసు, మల్లేష్ గౌడ్, శశిధర్ ముదిరాజ్, ప్రభాకర్, మెట్ల శీను, సాయి తేజ, గోపాల్, మహేందర్, నాని, ముంతాజ్, అంజి, భూపతి రెడ్డి, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ రికార్డుల తనిఖీలు.

హనుమకొండ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి టౌన్) హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం పై ఏసీబీ, విజిలెన్స్ అధికారుల సోదాలు ముమ్మరం అయ్యాయి. మొన్నటి వర్కు ఏసీబీ అధికారులు దాడులు చేయగా, ఈరోజు మధ్యాహ్నం నుండి విజిలెన్స్ అధికారులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు జరుపుతున్నారు. ఫోన్ పే ల ద్వారా ముగ్గురు డాక్యుమెంట్స్ రైటర్లు రిజిస్ట్రార్లకు మామూళ్లు పంపడం, వాటి నుంచి పై అధికారులకు సైతం వాటాలు వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల చేసిన డాక్యుమెంట్ ద్వారా ఓ రైటర్ 90 లక్షలతో విల్లా కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలిస్తున్నారు.

# మత్తు మాదక ద్రవ్యాలు మన ఒంటికి అనారోగ్యం

**- బాల్య వివాహాలు మన ఇంటికి అనారోగ్యం. - జిల్లా సంక్షేమ అధికారిణి ఈపీ ప్రేమలత.**



ములుగు (తెలంగాణ వాణి):ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99రోజుల ప్రత్యేక కార్యాచరణ)లో భాగంగా గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని టీజిటీడబ్ల్యు ఆర్ ఎస్ స్పోర్ట్స్ (బాయ్స్) మరియు జెడ్పహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగము ములుగు ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు మాదకద్రవ్యాల నిషేధం మరియు వివిధ బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ హరికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు సంక్షేమ అధికారిణి ప్రేమలత ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి ఈపి ప్రేమలత మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా మన ములుగు జిల్లాను తీర్చిదిద్దడం కోసం మంత్రి సీతక్క సూచన ప్రకారం ఈ అవగాహన కార్యక్రమాలను నివహించడం జరుగుతున్నదని తెలిపారు. డ్రగ్స్ అనేవి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని అవి ఆనంద కారకాలు కాదని,అవి ప్రమాదం మాత్రమే కాకుండా ప్రాణాంతకం అని అన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వలన వాటిని వినియోగించే వారు సమాజంలో వావి వరుసలు మరచి మృగంలా మారే ప్రమాదం ఉందని అన్నారు. అలాగే టెక్నాలజీ ఎంత చేతిలో ఉన్నా, దాన్ని సరైన దిశలో వినియోగించే విధానం తెలియకపోతే అది మన జీవితాలను వినాశకరం చేస్తుందని అన్నారు. కావున వేసవికాల సెలవుల్లో విద్యార్థులు సెల్ ఫోన్ ను వినియోగించి అనవసరమైన వ్యాపకాలపై దృష్టి పెట్టకుండా ఏదైనా కొత్త విషయాలను వినూత్నంగా నేర్చుకునే ప్రయత్నం చేయాలని ఎదగాలని సూచించారు. వేసవికాలం సెలవుల్లో బయట తిరగవద్దని, వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని జాగ్రత్తలు చెప్పారు. అదేవిధంగా పోషణ పఖ్వాడాలో భాగంగా పోషకాహార ప్రాధాన్యాన్ని కూడా పిల్లలకు వివరించడం జరిగింది. అనంతరం సభాధ్యక్షత వహించిన ప్రొటెక్షన్ ఆఫీసర్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు "బాల్య వివాహం – బ్రతుకు ఆగం" అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను, ఒకవేళ బాల్య వివాహాలను జరిపినా సహకరించినా లేదా ప్రోత్సహించిన సదరు వ్యక్తులపై తీసుకునే చట్టపరమైన శిక్షలను గూర్చి వివరించడం జరిగింది. అలాగే మిగతా బాలల హక్కుల చట్టాలను ఉల్లంఘించిన వారిపై విధించే చట్టపరమైం చర్యలను గూర్చి వివరించి, ఒకవేళ ఎవరైనా పిల్లలు అత్యవసరమైన ఆపదలో ఉన్నట్లు గమనిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098/112 టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేసి ములుగు జిల్లాను బాలలకు స్నేహపూర్వకంగా తీర్చిదిద్దాలనే మన జిల్లా కలెక్టర్ దివాకర సంకల్పంలో అంతా భాగస్వామ్యం అవుదామని కోరారు. అనంతరం జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న మాట్లాడుతూ పిల్లలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న వివిధ బాలల సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. బాలికల సంరక్షణ, వారికి చదువు,వారి అభివృద్ధి ఇలా వారికి అన్ని రంగాల్లో సమ ప్రాధాన్యతను ఇవ్వాల్సిన అవసరాన్ని గూర్చి " భేటీ బచావో – భేటీ పడావో" కార్యక్రమం ముఖ్య ఉద్దేశంగా తెలిపారు.

# బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు.



కుత్బుల్లాపూర్,ఏప్రిల్ 24: తెలంగాణ వాణి..కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని, డివిజన్ ల, షాపూర్ నగర్,సూరారం,గండిమైసమ్మ, బౌరంపేట డివిజన్లలో , కాంగ్రెస్ పార్టీ లితెలంగాణ ప్రోటోకాల్ కో ఆర్డినేషన్ వైస్ చైర్మన్, యువ నాయకుడు బొంగునూరి కిషోర్ రెడ్డి బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో , చలివేంద్రాలు వారి ఫౌండేషన్ సభ్యులు ఏర్పాటు చేశారు. వేసవికాలం కావడంతో ప్రజలు త్రాగడానికి రోడ్డున వెళ్ళే ప్రజలకి దాహం తీర్చే విధంగా చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బికేఆర్ ఫౌండేషన్ సభ్యులు, బెంబిడి హనుమంత్ రెడ్డి, దర్శన్ యాదవ్, నరసింహ రెడ్డి, మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, బొబ్బల నరసింహ రెడ్డి, గజానంద్, మహేష్, కార్తీక్ రెడ్డి, బాబన్ నదీం, విక్రాంత్, అరుణ్ రెడ్డి, గంట శివారెడ్డి, రమేష్, జగదీష్, జగన్, తిరుపతి రెడ్డి, బొంగునూరి భరత్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండ జిల్లా నూతన డీవైఎస్ఓ ప్రశాంత్‌కు ఘన స్వాగతం



హన్మకొండ, ఏప్రిల్ 23:(తెలంగాణ వాణి ప్రతినిధి) హన్మకొండ జిల్లా నూతన క్రీడా అధికారి (డివైఎస్ఓ) గా బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్ ను ఉమ్మడి వరంగల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ గడ్డం వెంకటస్వామి ఘనంగా సత్కరించారు. గురువారం నాడు ఉదయం ఇండోర్ స్టేడియంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో టైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి తో పాటు కోచ్‌లు స్నేహ, మామునూరి సంపత్, కార్తికేయ క్రీడాకారులు,వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై నూతన డీవైఎస్ఓకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా డివైఎస్ ఓ ప్రశాంత్ మాట్లాడుతూ ?జిల్లాలో తైక్వాండో క్రీడ అభివృద్ధికి, క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. అంతేకాకుండా ప్రతి క్రీడాకారుడు,రాష్ట్ర జాతీయస్థాయిలో పథకాలు సాధించి జిల్లాకు రాష్ట్రానికి వన్నె తేవాలని ఆకాంక్షించారు. నేడు చేపట్టబోయే సమ్మర్ క్యాంప్ లో అత్యదిక స్థాయిలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వారికి ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ తీసుకోవాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఉమ్మడి వరంగల్ జిల్లా పౌరహక్కుల సంఘం మద్దతు.

**పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ చందర్ ,ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి.**

హనుమకొండ ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి టౌన్) తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల పట్ల నిరంకుశ విధానాల ఫలితంగా బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని కూలదోసిన చరిత్ర ఆర్టీసీ కార్మికుల ది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆర్టీసీని ప్రభుత్వ రంగముగా గుర్తిస్తాము, విలీనం చేస్తామని ,ప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా సమానవేతనాలు చెల్లిస్తామని ,కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని, బకాయిల చెల్లింపు ,పెండింగ్ జీతాలు, ఇతర బెనిఫిట్స్ ఇస్తామని ,పనిగంటల పరిస్థితులు డ్యూటీ గంటలు తగ్గించి మెరుగైన పరిస్థితులను కల్పిస్తామని, ఆరోగ్య సదుపాయాలు, మెడికల్ ఇన్సూరెన్స్ మెరుగుపరుస్తామని ,పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లిస్తామని హామీలు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ కనీసమైన కార్యాచరణ ముందుకు పోకపోవడం వలన పదేపదే ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదు. గత్యంతరము లేని పరిస్థితులలో సమ్మె నోటీసు ఇచ్చి 40 రోజులు దాటిన ప్రభుత్వానికి స్పందన లేకపోవడం అనేది చాలా దుర్మార్గమైనటువంటి దానిగా పౌర హక్కుల సంఘం ఖండిస్తున్న దన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చేసిన చర్చలు విఫలం కావడం అనేది ప్రభుత్వ బాధ్యతారహిత విధానానికి నిదర్శనమని అన్నారు. రవాణా సేవలను అందించే ముఖ్యమైన సంస్థ అయిన ఆర్టీసీ, వేలాది కార్మికుల కష్టంతో నడుస్తోంది. ఆర్టీసీ కార్మికుల సమస్యలు చాలా కాలంగా పరిష్కారం కాని పరిస్థితిలో ఉన్నాయి. వారి ఆవేదనను ప్రభుత్వం గమనించి వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి. సమ్మె అనేది వారి చివరి మార్గం మాత్రమే అని మేము భావిస్తున్నాము. ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఆర్టీసీ కార్మికులకు మా ఐక్యతను తెలియజేస్తూ, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అంగీకరించాలని కోరుతున్నాము. లేనిపక్షంలో నిర్బంధాల ద్వారా బెదిరింపుల ద్వారా ఎ స్మాచట్టాన్ని ప్రయోగించడం ద్వారా అణచివేయాలని చూస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరిస్తున్నాము. అదే సమయంలో, ఈ సమస్య త్వరగా పరిష్కారం కావాలని, ప్రజలకు ఇబ్బందులు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయంత్, కార్యదర్శి పాణి డిమాండ్ చేశారు.

# గూడులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు

**సీఎం రేవంత్ రెడ్డి సంకల్పం.**

**కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు.**

**కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్**



కోరుట్ల:ఏప్రిల్ 23 (తెలంగాణ వాణి)తెలంగాణ రాష్ట్రశీలో గూడులేని నిరుపేద కు ఇందిర మ్మ ఇల్లు ఇవ్వాలనే సంకల్పం తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇల్లు అందజేయ డమే లక్ష్యంగా పని చేస్తున్నా రని కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు,కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ తెలిపారు. కోరుట్ల పట్టణశీలోని భీముని దుబ్బ వాడకు చెందిన అగ్గ రాజు – లక్మిరాజం, అగ్గ సుజాత – రాజేశంలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని గురువారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని నూతన వస్త్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ఏ ఒక్కరు ఇల్లు లేని వారు ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని చేపట్టారన్నారు. నియోజక వర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, 14వ వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి, యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు చెట్పల్లి రంజిత్ గుప్తా,వార్డు ప్రజలు,ఇందిరమ్మ గృహ ప్రవేశ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులు శాంతియుత వాతావరణంలో సమ్మె నిర్వహించుకోవాలి

## - ప్రజా అశాంతికి గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు - పోలీస్ కమిషనర్ వెల్లడి

**కరీంనగర్** కరీంనగర్ లో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో చట్టాన్ని కాపాడటం పోలీస్ శాఖకు ప్రధాన ప్రాధాన్యతగా ఉందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. సమ్మెను ప్రజాస్వామ్యపరమైన హక్కుగా గౌరవిస్తున్నప్పటికీ , అది పూర్తిగా శాంతియుత వాతావరణంలోనే నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పేర్కొన్న ముఖ్య అంశాలు ఇలా ఉన్నాయి:సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ మరియు రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా, అలాగే ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి డ్యూటీలో చేరినా, వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి స్థాయిలో పోలీస్ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.బస్సుల రాకపోకలు, డిపో ప్రాంతాలు,ముఖ్య కూడళ్లు, మరియు బస్టాండ్ పరిసరాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా,ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా,అధికారులపై దాడులకు పాల్పడినా, అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం,వదంతులు వ్యాప్తి చేసిన వారిపైనా పర్యవేక్షణ కొనసాగుతోందని , అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమ్మెలో పాల్గొనే కార్మికులు మరియు ప్రజలు పరస్పర గౌరవం పాటిస్తూ,ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.శాంతి భద్రతల విఘాతం కలగకుండా సమ్మె నిర్వహించుకోవాలని ఎక్కడనైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేటట్లు చర్యలు చేపడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు మరియు వారి ఉద్యోగం పరంగా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు .కరీంనగర్ ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా, ఆర్టీసీ బస్సులు నడిపే డ్రైవర్లను బెదిరింపులకు గురిచేసినా వెంటనే కరీంనగర్ పోలీసు స్పెషల్ బ్రాంచి కంట్రోల్ రూమ్ నంబర్ 8712670713 కు కాల్స్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు. సమాచారం



అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

### ఆర్టీసీ సమ్మె ఉద్రిక్తతల మధ్య

# డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



**నర్సంపేట:**రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె ఉద్రిక్తతల మధ్య వరంగల్ జిల్లాలో సంచలన ఘటన చోటుచేసుకుంది. నర్సంపేట ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్ శంకర్ గౌడ్ తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.సమ్మె నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ, ఆయన తనపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం. ఈ ఘటనను గమనించిన సహచరులు మరియు స్థానికులు వెంటనే స్పందించి ఆయనను అడ్డుకొని ప్రాణాపాయం నుంచి కాపాడారు.తీవ్ర గాయాలపాలైన శంకర్ గౌడ్‌ను వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.ఈ ఘటనతో ఆర్టీసీ ఉద్యోగుల్లో ఆందోళన మరింత పెరిగింది. సమ్మె కొనసాగుతున్న సమయంలో ఈ సంఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### కిడ్నీ మార్పిడితో ఎంతో మందికి

# పునర్జన్మ నిచ్చిన యశోద హాస్పిటల్




**కరీంనగర్** హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ యూనిట్ కిడ్నీ చికిత్స విభాగంలో అరుదైన రికార్డును ప్రముఖ నెఫ్రాలా జిస్ట్ డాక్టర్ రాజశేఖర్ చకవర్తి మరియు వారి బృంద ఇప్పటి వరకు 346 కిడ్నీ మార్పిడి శాస్త్రదేశం అత్యంత విజయవంతగా నిర్వహించి ఎంతో మంది భాదతులకు పునర్జన్మ ప్రసాదించాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య నిపుణులు కిడ్నీ మార్పిడిలో తాము సాదించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. సాధారణంగా కిడ్నీ మార్పిడికి రక్త గ్రూపులు కలవడం ప్రధానం అయితే, యశోద హాస్పిటల్స్ బృందం బ్లడ్ గ్రూప్ వేరుగా ఉన్న రోగులకు (ఏఓబి ఇన్కంప్లేటిబ్లె ట్రాన్స ప్లంట్) కూడా విజయవం తంగా కిడ్నీ మార్పిడి నిర్వ హించి వారు ప్రస్తుతం ఆరోగ్య కరమైన జీవితాన్ని గడిపేలా చేయడంలో విజయం సాధించింది. వయోభారంతో సంబంధం లేకుండా చికిత్స శస్త్రచికిత్సల విషయంలో వయస్సు ఒక అడ్డంకి కాదని యశోద వైద్యులు నిరూపించా రు.60 ఏళ్ల పైబడిన వృద్ధు లలో కూడా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవం తం పూర్తి చేసి,వారి ఆయుష్షు ను పెంచడంలో కీటక పాత్ర పోషించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితు ల్లో కూడా అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఈ మైలురాయి ని చేరు కోవడం పట్లహర్షం వ్యక్తం చేశాడు.ఈ సందర్భం గా డాక్టర్ జశ్వంత్ చల్లా మాట్లాడుతూ కిడ్నీ వైపల్యం తో బాధపడి రోగులకు డయాలసిస్ అనేది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే కానీ కిడ్నీ మార్పిడి వల్ల రోగుల జీవన ప్రమాణా లు గణనీయంగా మెరుగుపడ తాయి.మా బృందం సాదిం చిన ఈ 346 ట్రాన్సిప్లాంట్లు కేవలం సంఖ్య మాత్రమే కాదు 346 కుటుంబాల్లో నిండిన వెలుగులు అని అన్నారు.రక్త గూపులు వేరైనా కిడ్నీ మార్పి డి సాధ్యమే అన్న అవగాహన ప్రజల్లో పెరగాలని పేర్కొ న్నారు.యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ సిటీ యూనిట్ అత్యాధునిక మౌలిక సదుపా యాలు మరియు అనుభ వజ్ఞులైన వైద్య బృందంతో కిడ్నీ సంబంధిత వ్యాధులకు అంతర్జాతీయ స్థాయి చికిత్స లను అందిస్తూ దేశంలోనే అత్యుత్తమ ట్రాన్స్ ప్లాంట్ సెంటర్ గా ఎదుగుతోందని వైద్యులు జశ్వంత్ తెలిపారు.

# తిరుపతి రవాణా రంగంలో నూతన శకం

### - వాహన సామర్థ్య తనిఖీ కేంద్రం ప్రారంభం....



**తిరుపతి** వాహన సామర్థ్య తనిఖీ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి?రవాణా రంగంలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం కపుగున్నేరి గ్రామంలో విష్ణు వాహన ఆరోగ్య తనిఖీ మరియు చికిత్సా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యంత్రీకృత తనిఖీ కేంద్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు.?సాంకేతిక పరిజ్ఞానంతో రహదారి భద్రతఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనాల సామర్థ్యాన్ని పరీక్షించడం వల్ల రహదారి భద్రత మెరుగుపడుతుందని తెలిపారు. యంత్రాల ద్వారా జరిగే ఈ పరీక్షలు పారదర్శకతను పెంచుతాయని, తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ఇటువంటి వసతులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన వెల్లడించారు.?ముఖ్య అతిథులు మరియు పౌరుల భాగస్వామ్యంఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సంస్థ నిర్వాహకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉత్సవాలతో ముస్తాబైన బ్రహ్మంగారిమఠం

### - భక్తుల కోసం చలువ పందిళ్లు

### - విద్యుత్ కాంతులతో కలకలాడుతున్న దేవాలయం

### - మొదలైన ఆరాధన గురు పూజ మహోత్సవములు

**బ్రహ్మంగారిమఠం** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధనా గురుపూజోత్సవములతో బ్రహ్మంగారిమఠం పులకిస్తోంది. ఈ ఉత్సవాలు గురువారం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అదే విధంగా ఆరాధన ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండే కాకుండా పురుగు రాష్ట్రాలైన కర్ణాటక ,తమిళనాడు ఒరిస్సా తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారు. ముందే ఎండాకాలం ఆపై సూర్య భగవానుని ప్రతాపం తాండవిస్తోంది. దీంతో ఉత్సవాలకు వచ్చే భక్తాదులు సేద తీర్చే అందుకోసం ఆలయ నిర్వహకులు పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవాలలో ఆలయ ప్రాంగణంతోపాటు గర్భగుడి గాలిగోపురాలు మొదలుకు ప్రాంతాలలో విద్యుత్ కాంతులు వెదచల్లేలా రంగురంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు అదేవిధంగా వివిధ రకాలైన దేవతామూర్తుల విగ్రహాలను విద్యుత్తు లాంపులతో ఏర్పాటు చేయడం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి అదేవిధంగా ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారని వారికి కావలసిన క్యూ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు అదేవిధంగా త్రాగునీరు వైద్యం మొదలు అన్ని రకాల సౌకర్యాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా మటం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా భక్తాదుల కోసం నిత్య అన్నదానాన్ని మంచి రుచికరంగా ఏర్పాటు చేసినట్లు మేనేజర్ ఈశ్వర చారి తెలిపారు. ఉత్సవాలలో భాగంగా గురువారం నటాధిపతులు శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వాములవారు తన సతీమణితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు గోమాత కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో కలియ తిరుగుతూ భక్తాదులను పలుకరిస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకుంటూ వారికి ఆశీర్వచనాలను అందజేశారు. ఆరాధన ఉత్సవాలు ప్రారంభమైన మొదటి రోజునే బ్రహ్మంగారిమఠం కళకళలాడటం విశేషం. రాబోయే రెండు రోజుల్లో ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులను తరలివస్తారని వారికి అనుగుణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ అధ్యక్షతన భీమటం ఎస్ఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ వారు కడప జిల్లా నలుమూలల నుండి రా కడప ,రాజంపేట, మైదుకూరు, పులివెందుల ,జమ్మలమడుగు,



ప్రొద్దుటూరు ,బద్వేలు, గిద్దలూరు ,పోరుమామిళ్ల ,తదితర పట్టణాల నుండి పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను భక్తుల కోసం నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరాధన ఉత్సవాలలో ముఖ్యంగా 26వ తేదీ వైశాఖ శుద్ధ దశమి నాడు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు సజీవ సమాధిలోనికి ప్రవేశించిన రోజు కనుక ఆ రోజున పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారనే ఉద్దేశంతో వాటికి కావలసిన అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.ఉత్సవాలలో నేడు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం ఐదు గంటలకు వీరబ్రహ్మ సుప్రభాతం నామ సంకీర్తన ఎనిమిది గంటలకు అభిషేకం, సహస్రనామార్చన 10 గంటలకు ఉత్సవం, రాత్రి 10 గంటలకు గజవాహన ఉత్సవం అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులచే హరికథ కాలక్షేపంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నట్లు ఆలయ మేనేజర్ ఈశ్వర చారి తెలిపారు

### వాహనాలను ఎప్పటికప్పుడు

# కండిషన్లో ఉంచుకోవాలి

### - అదనపు ఎస్పీ మహమ్మద్ రియాజ్ హుల్ హక్



**నారాయణపేట** జిల్లా పోలీస్ హెడ్క్వార్టర్స్లోని పరేడ్ గ్రౌండ్లో జిల్లా పరిధిలో వినియోగంలో ఉన్న పెట్రోల్ కార్లు, ౚఉూ వాహనాలను అదనపు ఎస్పీ (ఆంఖీ) ఎండి రియాజ్ ఉల్ హక్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల మెయింటెనెన్స్, వినియోగ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ వాహనాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు వాహనాలు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా, సక్రమమైన కండిషన్లో ఉండేలా చూసుకోవాలని అన్నారు. వాహనాలకు సంబంధించిన చిన్న చిన్న లోపాలైమైన ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయించాలని ఓూ, ఖీఎ విజయ్ భాస్కర్ మరియు సిబ్బందికి ఆదేశించారు. ప్రతి రోజూ వాహనాలను శుభ్రపరచడం, వాటర్ సర్వీసింగ్ చేయించడం, సమయానుకూలంగా ఆయిల్ మార్చడం వంటి నిర్వహణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రాత్రి సమయంలో నిర్వహించే పెట్రోలింగ్ మరింత సమర్థవంతంగా ఉండేలా అన్ని పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరిగేలా చూడాలని, వాటికి ఉఖూ వ్యవస్థను అనుసంధానం చేసి ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. పెట్రోలింగ్ సమయపాలన, కవరేజ్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అదేవిధంగా పోలీస్ వాహన డ్రైవర్లకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు (వర్క్షాపులు) నిర్వహిస్తూ డ్రైవింగ్ నైపుణ్యాలు, ట్రాఫిక్ సైన్బోర్డులు, వాహన యాంత్రిక అంశాలపై అవగాహన పెంచాలని సూచించారు. డ్యూటీ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, విధుల్లో ఉన్నప్పుడు యూనిఫాం నిట్ టర్న్ అవుట్ పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓూ, ఖీఎ విజయ్ భాస్కర్, పోలీస్ వాహన డ్రైవర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

### వికారాబాద్‌లో రెండవ రోజు

# ఆర్టీసి సమ్మె

**వికారాబాద్ జిల్లా** ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కూడా కొనసాగుతోంది. సమ్మె నేపథ్యంలో వికారాబాద్ బస్ డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. డిపో పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, శుభప్రద పటేల్, వికారాబాద్ టౌన్ అధ్యక్షుడు గోపాల్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనతో బస్ డిపో వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. సమ్మె కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా, ప్రజా రవాణా సేవలు దాదాపు స్థంభించిపోయాయి.

### హాయత్ నగర్‌లో

# రెండవ రోజు

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రెండవ రోజు ఆర్టీసీ సమ్మెలో భాగంగా టీఎంయూ మాజీ అధ్యక్షుడు అశ్వథామ రెడ్డి ఆధ్వర్యంలో హయత్ నగర్ డిపో 1,2 ముందు ఆర్టీసీ కార్మికుల నిరసన తెలిపారు,తమ సమస్యల పరిష్కారం కోసం కార్మికులు పట్టుబడుతుండటంతో రవాణా వ్యవస్థపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 95% మంది కార్మికులు స్వచ్ఛందంగా విధులకు గైర్హాజరై సమ్మెలో పాల్గొంటున్నారని నేతలు తెలిపారు. వివిధ రూపాల్లో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నామని, కార్మికులందరూ ఐక్యంగా ఉన్నారని వారు పేర్కొన్నారు.గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ఆర్టీసీ కార్మికుల కోసం అనేక హామీలు ఇచ్చిందని నేతలు గుర్తు చేశారు.

గత ప్రభుత్వం మాపై అణచివేత చర్యలకు పాల్పడినప్పుడు, ప్రస్తుత అధికార పార్టీ నేతలు మాకు అండగా నిలబడ్డారు.నాడు మీరు ఇచ్చిన హామీలను, మీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను ఇప్పుడు అమలు చేయాలని కోరుతున్నాం అన్నారు.మేమేమీ అసాధ్యమైన కోరికలు కోరడం లేదు. మీరు గతంలో న్యాయమైనవి అని అంగీకరించిన డిమాండ్లనే ఇప్పుడు పరిష్కరించమంటున్నాం. గత ప్రభుత్వం మాపై చేసిన హరాస్మెంట్కు నిరసనగా మేము మీకు మద్దతు ఇచ్చాము. ఇప్పుడు అధికారం మీ చేతుల్లో ఉంది కాబట్టి, కార్మికుల కష్టాలను గుర్తించి సానుకూల నిర్ణయం తీసుకోవాలి అని నేతలు విజ్ఞప్తి చేశారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



## ఒంటిమిట్ట కోదండ రామాలయ

# అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

**కడప** టీటీడీ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకుల అత్యుత్సాహం చూపించడం వివాదంగా మారింది. పులివెందులకు వెళ్లి.. మాజీ సీఎం ౘ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్కు వేద ఆశీర్వచనంతో పాటు, శేష వస్త్రం, రాములోరి తోమాల, ముత్యాల తలంబ్రాలు అందజేసిన విషమం తెలిసిందే. మాజీ సీఎం ౘ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ను కలవడంపై ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకులు ఎ.శ్రావణ్కుమార్, వీణా మనోజ్కుమార్, కె.పార్థసారథికి, ఉప కార్యనిర్వహణాధికారి ఎ.ప్రశాంతి షోకాజ్ నోటీసులు జారీ చేసి.. రెండు రోజుల్లో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు.....

# సాయన్న సతీమణి మృతికి ఎమ్మెల్యే సంతాపం

**సికింద్రాబాద్** దివంగత కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే జ్ఞాని సాయన్న సతీమణి గీత నిన్న పరమపదించడంతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం అశోక్ నగర్ లోని వారి నివాసానికి వెళ్లి గీత పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించి, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

# వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం

- ఆరోగ్యం కాపా డుకుందాం
- రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లకు టోపీలు పంపి
- ణికె.శ్రీనవాసులు,అధ్యక్షులు

**కర్నూలు** సమాచార శాఖ భవన్ ప్రాంగ ణంలో బుధవారం రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కే.శ్రీనివాసులు ఆధ్వ ర్యంలో వేసవిలో జాగ్రత్తలు పాటిద్దాం...ఆరోగ్యం కాపాడుకుందాం అనే నినాదంతో జర్నలిస్ట్ లకు టోపీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్ర మానికి సమాచార శాఖ డిడి కె.జయమ్మ,సెట్కు రు సీఈఓ డాక్టర్ కె.వేణుగోపాల్,ఏపీజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కె.హరినాథ్ రెడ్డి,టి.రామ కృష్ణ,మెడిక వర్ హాస్పి టల్ సిబ్బంది జనరల్ మెడిసిన్ డాక్టర్ సరయు రెడ్డి,జి.ఎం.డాక్టర్ మ హేశ్వర్ రెడ్డి,ఎజి ఎం ఎస్.ఖాదర్ బాషా హాజర య్యారు.అనంతరం వారి చేతుల మీదుగా జర్న లిస్ట్ లకు టోపీలు అందచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిక్షణం సమాజంలో జరి గే విశేషాలను సే కరించి,వార్తలుగా ప్రచురణ చే స్తూ ప్రజలను చైత న్యం చేయడంలో జర్నలిస్ట్ ల పాత్ర ప్రధమంగా ఉందన్నారు.వార్తల సేకరణలో జర్నలిస్ట్ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిం చాలని సూచించారు.ఇలాంటి జర్నలిస్ట్ లను వే సవి తాపం నుండి కాపాడేందుకు తమ తృణసా యంగా రాయల సీ మ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.శ్రీనవాసులు టోపీలు పం పిణి చేయడం అభి నందనీయం అని కొనియా డారు.

# జగిత్యాల క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో కలకలం

- ఆభరణాల మాయంపై బంధువుల ఆందోళన




**జగిత్యాల:** జగిత్యాల పట్టణంలోని ఎం సి హెచ్ ప్రాంగణంలోని క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో ఓ రోగి చికిత్స పొందుతూ మృతి చెందగా, రోగి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు కనిపించడం లేదని కుటుంబ సభ్యుల ఆందోళన పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొడిమ్యాల మండలం నాచుపల్లి కి చెందిన ఓ మహిళ విషమ పరిస్థితిలో ఉండగా, బంధువులు క్రిటికల్ కేర్ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె పరిస్థితి విషమించి, మృతి చెందగా, క్రిటికల్ కేర్ లో చేరిన సమయంలో ఆమెపై ఉన్న బంగారు నగలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న జగిత్యాల టౌన్ పిఎస్ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు.

# భగీరథ మహర్షి పట్టుదల సేవాభావం

- ప్రతి ఒక్కరికి ఆదర్శంజిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచ్చుకుళ్ళ దామోదర్ రెడ్డి



**నాగర్ కర్నూల్** కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతు భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయుడిగా భగీరథుడు చరిత్రలో నిలిచిపో యారని అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని కలెక్టర్ ఈ సంద ర్భంగా వివరించారు.లక్ష్యం పట్ల అంకితభావం, పట్టుదల ఉంటే ఎంతటి కష్టమైన పనినైనా సాధించవచ్చని భగీరథుని జీవితం యువతకు గొప్ప సందేశమని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది భగీరథ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఈ వేడుకల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని భగీరథుని ఆశయాలకు అనుగుణంగా సమాజంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతు భగీరథుడు భూమిపైకి గంగను తెచ్చిన మహనీయు డని, వారి త్యాగనిరతి, పట్టుదల ఆదర్శనీయమని ఎమ్మెల్సీ కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. సగర కుల సంఘాల ప్రతిపాదనలను ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. నాగర్ కర్నూల్ పట్టణంలో అందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తామని హామీ ఇచ్చారు. సగర కుల సంఘ నాయకులు వక్తలు మాట్లాడుతూ భగీరథుని స్మరిస్తూ, విగ్రహాన్ని సగరకుల భవనాన్ని ఏర్పాటుకు, కృషి చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల జిల్లా అధికారులు,సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్,18వ వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్ సాగర సంఘం నాయకులు అల్లం రాముడు ,సీనియర్ జర్నలిస్టు సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్ ,టౌన్ అధ్యక్షులు బాలయ్య సాగర్ , బంగారయ్య సాగర్ , సూరంపల్లి సుధాకర్ సాగర సంఘం నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే



**జగిత్యాల:** తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జగిత్యాల రూరల్ మండలం చల్ గల్ వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, అధ్యక్షులు గాజంగి నందయ్య తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

# సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర

- ఈనెల 25న మెగా జాబ్ మేళా



**సిద్ధిపేట** ద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా, సిద్ధిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర పేరిట భారీ మెగా జాబ్ మేళాను వేదిక సిద్ధిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్ సిద్ధిపేట ఇందుర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో, ఉదయం 9:00 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలు అర్హతలు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు.ఈ మెగా జాబ్ మేళాలో అనేక ఐటి,ఫార్మసీ,ఇండస్ట్రీ, వివిధ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయి. ఆసక్తి గల అభ్యర్థులు, రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్పోర్ట్ ఫోటోలు మరియు కనీసం 5 రెజ్యూమ్ కాపీలతో హాజరు కావాలి.జిల్లాలోని యువతీ యువకులు ఈ అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సీపీ కోరారు.పోలీస్ శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, సామాజిక బాధ్యతగా యువతకు ఉపాధి కల్పించే దిశగా ఈ ఉద్యోగ మిత్ర కార్యక్రమాన్ని చేపడుతోందని సిపి రష్మీ పెరుమాళ్ తెలిపారు.

# పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

- ఆ మహర్షి పేరు మీద మిషన్ భగీరథ పథకం.
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.ఉద



వనపర్తి రూఅపర భగీరథుడు మహర్షి భగీరథుని జయంతి సందర్భంగా మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలకు మారు పేరు భగీరథుడని కఠోర సాధనతో గంగను నేల మీదకు తెచ్చిన మహానుభావుడు భగీరథుడు అని కొనియాడారు. ప్రజల దాహార్తి తీర్చే మంచినీటి పథకానికి కె.సి.ఆర్ మిషన్ భగీరథ అని నామకరణం చేసి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. మహనీయుల జయంతి కార్యక్రమాలకు కె.సి.ఆర్ హయాంలో ప్రత్యేక నిధులు కేటాయించి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని అన్నారు.నివాళులు అర్పించిన వారిలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్,కౌన్సిలర్.మురళీ సాగర్,విష్ణు సాగర్,మద్రికుంట.శ్రీనివాస్,చిట్యాల.రాము తదితరులు ఉన్నారు.

## బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

# విజయవంతం చేయండి

- ఎంపీపీ సి వీరనారాయణరెడ్డి పిలుపు





**బ్రహ్మంగారిమఠం** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 333వ ఆరాధన గురుపూజ మహోత్సవాలకు వచ్చేటటువంటి భక్తులకు ఏర్పాట్ల గురించి ఎంపీడీవో కార్యాలయం నందు కోఆర్డినేట్ మీటింగ్ గురువారం జరిగినది . ఈ సమావేశానికి ఆరోగ్యశాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, వివిధ కమ్యూనిటీ కి చెందిన అన్న సత్రాల మేనేజర్ లు ఎక్సైజ్ శాఖ, తాగునీటి వ్యవస్థ, పత్రికా విలేకరులు, విద్యాశాఖ అధికారులు , బస్సు సౌకర్యం కోసం డిపో మేనేజర్లు, తదితర అధికారులు అనధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారి ఉద్దేశించి మండల పరిషత్ అధ్యక్షులు చిలేకంపల్లి మాట్లాడుతూ జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆరాధన మహోత్సవాలను ప్రతి ఒక్కరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన అధికారులకు పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్ తో పాటు పోరుగు రాష్ట్రాలైన తెలంగాణ కర్ణాటక తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారనిపెద్ద ఎత్తున భక్తాదులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తాదులకు ఎటువంటి ఆటంకాలు కానీ ఇబ్బందులు కానీ లేకుండా చూడాల్సిన బాధ్యత మతం యాజమాన్యంతో పాటు ఇతర అన్ని శాఖల అధికారులపై ఉందని ఆయన పేర్కొన్నారు . కాబట్టి భక్తాదులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు సిద్ధం చేయాలని ఆయన అధికారులతో పేర్కొన్నారు. రవాణా శాఖ అధికారులు జిల్లాలోని ప్రధాన పట్టణాల నుంచి ప్రత్యేక బస్సులను విధిగా నడపాలని ఆయన తెలిపారు . అలాగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు మంచినీటితోపాటు విద్యుత్తు వైద్యము అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు . ముఖ్యంగా పోలీసు శాఖ వారు ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు . మిగిలిన అన్ని శాఖల అధికారులు కూడా మతం యాజమాన్యంతో సంప్రదిస్తూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు . అంతట ముందు ఆర్టీసీ మేనేజర్లతో కలసి మఠం మేనేజర్ బస్సు పార్కింగ్ ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ కార్తీక్ ,ఎంపీడీవో రామచంద్రారెడ్డి ,మఠం మేనేజర్ ఈశ్వర చారి అలాగే విద్యుత్, వైద్యశాఖ ,ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ తదితర అన్ని శాఖలకు సంబంధించిన అధికారులతో పాటు స్థానికంగా వివిధ కులాలకు సంబంధించిన కన్నసత్రాలను నిర్వహించే నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు .

## కౌలు కార్డు కొరకు కౌలు రైతులు

# దరఖాస్తు చేసుకోవాలి

- ఏవో సురేష్ బాబు

**తుగ్గలి:** కౌలు గుర్తింపు కార్డు కొరకు కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని తుగ్గలి మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములను కౌలుకు చేస్తున్న రైతులందరూ భూమి యజమాని నుండి 11 నెలల కాలపరిమితితో గల కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి ఆయన తెలియజేశారు.కౌలు గుర్తింపు కార్డు పొందుటకు రైతు 18 సంవత్సరాలు నిండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వాడై ఉండాలని,సాగు చేయుటకు ఒప్పందం కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు.కౌలు గుర్తింపు కార్డు కొరకు బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన ఆధార్ కార్డు,భూమి యజమాని సంతకంతో కూడిన ఒప్పంద పత్రం లేక గ్రామ విఆర్ఓ,తహసిల్దార్ ఆమోద పత్రం,భూ యజమాని పట్టాదారు పాసు పుస్తకం లను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలియజేశారు.కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నా కూడా భూ యజమానికి ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ,వడ్డీలేని పంట రుణాలు,ఇన్పుట్ సబ్సిడీ,పంటల బీమా వంటి పథకాలు వర్తిస్తాయని ఆయన తెలియజేశారు.ఇతర వివరాల కొరకు గ్రామాల పరిధిలోని గల స్థానిక రైతు సేవ కేంద్రం వద్ద వ్యవసాయ అధికారులను సంప్రదించాలని,ఈ అవకాశాన్ని కౌలు రైతులకు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలియజేశారు.

# "కన్ను కొట్టు ? మస్టర్ పట్టు...!"

- ఉపాధి హామీ పథకంలో డిజిటల్ మోసాలు,ఫేక్ ఎంట్రీలు.
- కొత్త పద్ధతులతో పెరుగుతున్న అవినీతి ఆరోపణలు.

**తుగ్గలి:** తుగ్గలి మండలంలో ఉపాధి హామీ పథకం అమలుపై కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించాల్సిన ఈ పథకం,కొందరి చేతుల్లో అక్రమాలకు మార్గంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ముఖ్యంగా మస్టర్ రోల్స్ నమోదు,హాజరు వివరాలు, డిజిటల్ రికార్డుల వినియోగంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.గ్రామాల్లో పని చేయని వ్యక్తుల పేర్లు కూడా మస్టర్ రోల్స్‌లో కనిపిస్తున్నాయనే ఆరోపణలు ప్రజల వైపు నుండి ఎక్కువగా వినిపిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో లేదా పట్టణాల్లో ఉన్న వ్యక్తుల పేర్లు హాజరు పట్టికల్లో నమోదు చేసి,నిధులు మళ్లిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి.కొన్ని చోట్ల నిజంగా పని చేసిన కూలీలకు సరైన గుర్తింపు లేకుండా,రికార్డుల్లో వేరే వివరాలు నమోదు అవుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.డిజిటల్ వ్యవస్థలు పెరిగిన తర్వాత కూడా పారదర్శకత రాకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోందని పలువురు మేధావులు తెలియజేస్తున్నారు. జిపిఎస్ ఫోటోలు,మస్టర్ వివరాలు, హాజరు సమయాలు,చెల్లింపుల రికార్డులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉంటేనే నిజాలు బయటపడతాయని స్థానిక ప్రజలు అంటున్నారు.ఉపాధి హామీ పథకం పేదల జీవనోపాధి కోసం ఉద్దేశించినదే కాని,అక్రమాలకు వేదిక కాకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తుగ్గలి మండలంలో నమోదైన పనులపై సమగ్ర విచారణ చేపట్టి,నిజంగా పని చేసిన కూలీలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..

## - ఘనంగా 'ఇంటింటికి ఆరోగ్యం'శిబిరం.

**తిరుపతి** మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాస్ సంస్థ టాటా ట్రస్ట్ సహకారంతో మంగళవారం కొర్లగుంటలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది.

ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. రాస్ సంస్థ గత మూడేళ్లుగా మహిళల ఆరోగ్యం కోసం విశేషంగా కృషి చేస్తుందని కొనియాడారు. టాటా ట్రస్ట్ విఆర్ఓ హేమంత్ కుమార్ మాట్లాడుతూ అకస్మాత్తుగా బరువు తగ్గడం నీరసం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.150 ముందు మహిళలకు రొమ్ము ,గర్భాశయ క్యాన్సర్ పరీక్షలతో పాటు ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ లీడర్లు విజయలక్ష్మి శారద లక్ష్మి మరియు టాటా ట్రస్ట్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు



RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana



# 'మెన్షన్ హౌస్ మల్లేశ్' మూవీ రివ్యూ!



మాగంటి శ్రీనాథ్ హీరోగా రూపొందిన సినిమానే 'మెన్షన్ హౌస్ మల్లేశ్'. బాల సతీశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకి రాజేశ్ నిర్మాతగా వ్యవహరించాడు. కథానాయికగా ఈ సినిమాతో గాయత్రి రమణ పరిచయమైంది. మార్చి 6వ తేదీన థియేటర్లకు ఈ సినిమా వచ్చింది. పెద్దగా పబ్లిసిటీ లేకపోవడం వలన, ఆడియన్స్ కి రీచ్ కాలేకపోయింది. అలాంటి ఈ సినిమా, ఈ రోజు నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. 'యాదగిరిగుట్ట'లో 2004వ సంవత్సరంలో ఈ కథ మొదలవుతుంది. భిక్షపతి – శంకరమ్మ సంతానంగా మల్లేశ్ ఉంటాడు. భిక్షపతి ఎప్పుడు చూసినా తాగడం .. మల్లేశ్ ను కొట్టడం చేస్తుంటాడు. దాంతో తండ్రిపై ద్వేషం పెంచుకుని ఇల్లొదిలి వెళ్లిపోయిన మల్లేశ్, తండ్రి చనిపోయిన తరువాతనే తన ఊరికి తిరిగొస్తాడు. తాగుడికి బానిసైన అతనికి, సాధ్యమైనంత త్వరగా పెళ్లి చేయాలని తల్లి ఆరాటపడుతూ ఉంటుంది. అలా మొత్తానికి 'జ్యోతి' (గాయత్రి రమణ)తో పెళ్లిజరిపిస్తుంది. ఆ ఊరికి కేశవ పెద్ద మనిషిగా వ్యవహరిస్తూ ఉంటాడు. అతని భార్యనే పద్మావతి (కామాక్షి భాస్కర్ల). కేశవను అందరూ చిన్నపటేల్ అని పిలుస్తుంటారు. పెద్ద పటేల్ కి ఒక మనవడు కేశవ అయితే .. మరో మనవడు మల్లేశ్ అన్నమాట. తమకి ఇష్టం లేని వ్యక్తిని పెళ్లి చేసుకున్న కారణంగా మల్లేశ్ తల్లిని పెద్ద పటేల్ కుటుంబం దూరం పెడుతుంది. చిన్నపటేల్ పది ఎకరాల భూమి మధ్యలో, మల్లేశ్ కి సంబంధించిన పది గుంతల భూమి ఉంటుంది. ఆ భూమిని సొంతం చేసుకోవడానికి చిన్నపటేల్ ప్రయత్నిస్తూ ఉంటాడు. మల్లేశ్ ఫస్టు నైట్ వృథాగా గడిచిపోతుంది. అతను విపరీతంగా ఆల్కాహాల్ తీసుకోవడమే అందుకు కారణమని డాక్టర్లు చెప్పడంతో షాక్ అవుతాడు. మల్లేశ్ దగ్గర విషయం లేదనే సంగతి చిన్న పటేల్ కి తెలుస్తుంది. అప్పుడు అతను ఏం చేస్తాడు? మల్లేశ్ భూమిని కాజేయాలనే అతని ప్లాన్ ఫలిస్తుందా? మల్లేశ్ తన బలహీనతను జయించగలుగుతాడా? అనేది మిగతా కథ. గ్రామాలలో పొలం తగాదాలు .. గట్టు పంచాయితీలు చాలా సహజంగా కనిపిస్తూ ఉంటాయి. వారసుల మధ్య ఈ గొడవలు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. అవతలివారి బలహీనతలపై దెబ్బకొట్టేసి, తమకి కావలసిన దానిని సొంతం చేసుకోవాలనే ఆలోచన కొంతమందిలో సహజంగానే కనిపిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రధానమైన అంశాన్ని ఎంచుకుని దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.ఒక గ్రామం .. రెండు కుటుంబాలు .. ఆ రెండు కుటుంబాలు విడిపోవడానికి కారణమైన ఒక బలమైన సంఘటన .. ఆ ద్వేషాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్న పొలం తగాదా ఈ కథలో ప్రధానమైనవిగా మనకి కనిపిస్తాయి. ఈ ఘర్షణకు .. సంఘర్షణకు ప్రతీకలుగా మల్లేశ్ – చిన్నపటేల్ పాత్రలఘును మలిచారు. చాలావరకూ ఈ కథ, ఈ రెండు పాత్రల చుట్టూనే తిరుగుతూ ఉంటుంది. ఆస్తుల కోసం చిన్నపటేల్ ఆలోచన చేయడం .. ఆచరణలో పెట్టడం ద్వారా ఆయనలోని విలనిజాన్ని ఆవిష్కరించారు. ఇక పిల్లల కోసం మల్లేశ్ ఆరాటపడటం .. అందుకోసం చేసే ప్రయత్నాలు కాస్త ఫన్నీగా అనిపిస్తాయి. ఈ రెండు ట్రాకులే ఈ కథలో ప్రాధాన్యతను సంతరించుకుని కనిపిస్తాయి. చివరికి చిన్నపటేల్ విసిరే ఛాలెంజ్ తో కథ నెక్స్ట్ లెవెల్ కి చేరుకుంటుంది.హీరో అల్లరిచిల్లరగా పెరగడం .. బుట్టలు బుట్టలుగా సీసాలు పేరుకుపోయే స్థాయిలో తాగేయడం .. స్నేహితులతో కలిసి తిరిగేయడం .. పేరుకి ఒక టెంట్ హౌస్ నడుపుతూ ఉండటం .. ఎవరైనా ఏదైనా అంటే వెంటనే గొడవకి వెళ్లడం వంటి రొటీన్ సీన్స్ తోనే ఈ కథ ముందుకు వెళుతూ ఉంటుంది. ఈ పాయింట్ ఏదో కొత్తగా ఉందే .. నెక్స్ట్ ఏమౌతుందో అనే ఉత్కంఠ మాత్రం ఉండదు. రొమాన్స్ .. కామెడీ .. ఎమోషన్స్ ప్రధానంగా ఈ సినిమా నడుస్తుంది. హీరో – హీరోయిన్స్ మధ్య నడిచే రొమాన్స్, మల్లేశ్ స్నేహితులైన సుధాకర్ రెడ్డి .. వీరబాబు పాత్రల ద్వారా కామెడీ వర్కౌట్ చేయడానికి చేసిన ప్రయత్నం కొంతవరకూ అలరిస్తుంది. ఎటొచ్చి ఎమోషన్ అనేది ఏ మాత్రం పండలేదు. బలంగా ఉంటుందనుకున్న ఫ్లాష్ బ్యాక్ కి కామెడీ టచ్ ఇచ్చేసి బలహీనంగా మార్చేశారు. ద హీరో తన చిన్నప్పుడు తండ్రిపై కోపంతో, అతను తాగే మందులో మూత్రం పోయడం, పెద్దయిన తరువాత తన తండ్రి ఫోటోపై చెడ్డీ ఆరేయడం కాస్త గీత దాటినట్టుగా అనిపిస్తుంది. మాగంటి శ్రీనాథ్ .. గాయత్రి రమణ నటన బాగానే ఉంది. మురళీధర్ గౌడ్ .. కామాక్షి భాస్కర్ల వంటి ఆర్టిస్టులకు సరైన పాత్రలు పడలేదనే అభిప్రాయం కలుగుతుంది. అమ్మ ముత్తు ఫొటోగ్రఫీ .. గ్యారీ బీ హెచ్ ఎడిటింగ్ .. సురేశ్ బొబ్బిలి సంగీతం కథకి తగినట్టుగానే కనిపిస్తాయి. ఎలాంటి ట్విస్టులు లేకుండా .. రొటీన్ గా సాగిపోయే ఈ సినిమా, ఓ మాదిరిగా అనిపిస్తుంది అంతే.

# నేను నటిని..

### కంటెంట్ క్రియేటర్‌ని కాదు: శివాత్మిక రాజశేఖర్

ప్రముఖ సినీ నటులు రాజశేఖర్, జీవితల కుమార్తె శివాత్మిక ఇండస్ట్రీలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... నెపోటిజం, సినిమా అవకాశాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రాజశేఖర్ కూతురిగా దర్శకులను కలిసే అవకాశం తనకు సులభంగా రావొచ్చు కానీ, ప్రతిభ ఉంటేనే ఇండస్ట్రీలో నిలబడగలమని ఆమె స్పష్టం చేసింది. తనకు 'రంగమార్తాండ'లో అవకాశం రావడానికి 'దొరసాని'లోని తన నటనే కారణమని గుర్తు చేసింది. తాను రాజశేఖర్ కూతురిని అని తెలిసి కూడా కొన్ని ప్రాజెక్టుల నుంచి తనను తప్పించారని, దానికి కారణం తనకంటే మరొకరికి సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఫాలోవర్లు ఉండటమేనని వెల్లడించింది. "నేను ఒక నటిని, కంటెంట్ క్రియేటర్‌ని కాదు. ఒక పాత్రకు నటి సెట్ అవుతుందా లేదా అని చూడాలి కానీ, ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లను చూసి అవకాశాలు ఇవ్వడం ఏంటి?" అని ఆమె పరిశ్రమ తీరును ప్రశ్నించింది.



# హీరోగా సత్య..

## నవ్వులే నవ్వులు పంచేలా 'జెట్లీ' ట్రైలర్!

స్టార్ కమెడియన్‌గా టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన సత్య, ఇప్పుడు హీరోగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'జెట్లీ'. రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను తాజాగా విడుదల చేశారు. పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ ట్రైలర్, చూసిన వారిని కడుపుబ్బా నవ్విస్తోంది. ట్రైలర్ ఆద్యంతం సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్లు, పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాలో 2024 మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్ విజేత రియా సింఘా హీరోయిన్‌గా నటించడం ఒక ప్రత్యేక ఆకర్షణ. ప్రముఖ నటులు వెన్నెల కిశోర్, వైవా హర్ష, అజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకు కాల భైరవ సంగీతాన్ని అందించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'జెట్లీ' చిత్రం మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.




# వరుస ఫ్లాప్స్‌తో కెరీర్‌పై సందిగ్ధం..!

కన్నడ సినిమాలతో కెరీర్ ప్రారంభించి, టాలీవుడ్‌లో తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటోంది. ప్రారంభంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని టాప్ హీరోయిన్ రేసులోకి వచ్చిన ఆమె... ఇప్పుడు మాత్రం వరుస ఫలితాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు కనిపిస్తోంది. దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి' సినిమాతో శ్రీలీల టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా... ఆమెకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా, ఇండస్ట్రీలో ఆమెకు వరుస అవకాశాలు రావడం విశేషం. రవితేజ సరసన నటించిన 'ధమాకా' సినిమా బ్లాక్‌బస్టర్ కావడంతో శ్రీలీల కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయింది. ఆ విజయంతో ఆమె టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. వరుసగా అరడజను సినిమాలు ఆమె చేతిలో పడగా, కొన్నింటి ఫలితాలు నిరాశపరిచాయి. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, పెద్ద హిట్ మాత్రం ఆమెకు దక్కలేదు. 'పుష్ప 2'లో చేసిన ప్రత్యేక డాన్స్ నంబర్‌తో ఇతర భాషల ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు తమిళ, హిందీ ఇండస్ట్రీల్లో అవకాశాలు కూడా వచ్చాయి. తమిళంలో చేసిన 'పరాశక్తి' సినిమా బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో అక్కడ ఆమెకు ఆశించిన గుర్తింపు రాలేదు. ఇక హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో చేస్తున్న సినిమా ఆలస్యం అవుతుండటం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఆ ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తవుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం. ఇటీవల వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో పవన్ కళ్యాణ్ సరసన నటించినా... సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా గుర్తింపు రాలేదు. అదే సమయంలో గత ఏడాది వచ్చిన సినిమాలు కూడా కమర్షియల్‌గా పెద్ద విజయాలను అందుకోలేకపోయాయి. ప్రస్తుతం తెలుగులో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, శ్రీలీల తన భవిష్యత్తును బాలీవుడ్ సినిమాపైనే ఆధారపెట్టినట్టు కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ధనుష్ హీరోగా తెరకెక్కుతున్న ఓ సినిమాలో ఆమెకు అవకాశం వచ్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. సినీ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ సంవత్సరం శ్రీలీల కెరీర్‌కు అత్యంత కీలకం. కనీసం ఒకటి రెండు హిట్స్ సాధిస్తేనే ఆమె మళ్లీ టాప్ రేసులోకి రావచ్చని అంటున్నారు.



# బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న 'భూత్ బంగ్లా'

చాలా కాలం తర్వాత బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తన పాత ఫామ్‌లోకి వచ్చారని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఏప్రిల్ 17న విడుదలైన 'భూత్ బంగ్లా' సినిమా మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. పెయిడ్ ప్రివ్యూల ద్వారానే రూ. 3.50 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలిరోజే రూ. 12.25 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించడం విశేషం. వీకెండ్ ముగిసే సరికి దేశవ్యాప్తంగా రూ. 58 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా, సోమవారం కొంత మందగించినా మంగళవారం మళ్లీ పుంజుకుని రూ. 8 కోట్లు రాబట్టింది. దీంతో ఐదు రోజుల్లోనే భారతీయ బాక్సాఫీస్ వద్ద మొత్తం రూ. 72.75 కోట్ల నెట్ (రూ. 86.62 కోట్ల గ్రాస్) కలెక్షన్స్‌ను నమోదు చేసింది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లో కూడా 'భూత్ బంగ్లా' మంచి జోరు చూపిస్తోంది. ఐదు రోజుల్లోనే 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటేసి, ప్రపంచవ్యాప్తంగా రూ. 118 కోట్ల గ్రాస్ వసూళ్లు నమోదు చేసింది. ఇదే ట్రెండ్ కొనసాగితే రెండో వారాంతానికి రూ. 150 కోట్ల క్లబ్‌లోకి సునాయాసంగా చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రానికి పోటీగా 'ధురంధర్ 2' ఉన్నప్పటికీ, ప్రేక్షకులు అక్షయ్ స్టైల్ కామెడీకి పెద్ద పీట వేస్తున్నారు. ఈ ఏడాది విడుదలైన హిందీ చిత్రాల్లో 'భూత్ బంగ్లా' ఇప్పటికే టాప్–3లో చోటు దక్కించుకుంది. షాహిద్ కపూర్, తమన్నా నటించిన 'ఓ రోమియో' (రూ. 92 కోట్లు), అలాగే రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో వచ్చిన 'మర్దానీ 3' (రూ. 78 కోట్లు) లైఫ్‌టైమ్ కలెక్షన్స్‌ను కేవలం ఐదు రోజుల్లోనే అధిగమించడం ఈ చిత్ర విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.ఇక హారర్ కామెడీ జానర్‌లో సంచలనం సృష్టించిన వరుణ్ ధావన్ నటించిన 'భేడియా' (రూ. 90 కోట్లు) రికార్డును కూడా ఈ చిత్రం దాటేసింది. త్వరలోనే 'ముంజ్యా' (రూ. 132 కోట్లు) కలెక్షన్స్‌పై కన్నేసింది. అలాగే 'స్త్రీ', 'భూల్ భూలయ్యా 2' వంటి సూపర్ హిట్ చిత్రాల సరసన నిలవడానికి సిద్ధమవుతోంది.దర్శకుడు ప్రియదర్శన్, అక్షయ్ కుమార్ కాంబినేషన్‌లో సినిమా వచ్చి దాదాపు 14 సంవత్సరాలు అవుతోంది. గతంలో 'భూల్ భూలయ్యా' వంటి క్లాసిక్ హిట్ ఇచ్చిన ఈ జోడీ, ఇప్పుడు 'భూత్ బంగ్లా'తో మరోసారి మేజిక్‌ను రిపీట్ చేసింది. ఈ చిత్రంలో టబు, వామికా గబ్బి కీలక పాత్రల్లో మెప్పించగా, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్‌ల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలం అయ్యింది. హారర్ ఎలిమెంట్స్‌కు వింటేజ్ కామెడీ జోడవడంతో ప్రేక్షకులు థియేటర్లకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.మొత్తంగా, అక్షయ్ కుమార్‌కు ఈ చిత్రం బలమైన కమ్‌బ్యాక్‌గా నిలుస్తోంది. వరుస ఫ్లాప్స్ తర్వాత మంచి విజయాన్ని అందుకోవడం ఆయన కెరీర్‌కు పెద్ద బూస్ట్‌గా మారింది.




Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com